VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

రిజిస్టర్డు నెం. 6097. 4 పేజీలు : ఒక అణా

విశాలాంధ్ర

సంపుటి 3 ★ విజయవాడ: బుధవారం; జూన్ 2; 1954 ★ సంచిక 53

70572

టిటో సంరక్షణకై ఏథెన్స్‌లో అరెస్టులు

ఏథెన్స్, మే 31

ఇక్కడికి యుగోస్లావియా అధ్యక్షుడు, టిటో రాక సందర్భంలో టిటో వ్యతిరేక చర్యలేమీ జరగకుండా అరికట్టేందుకుగాను ఏథెన్సులో చాలా అరెస్టులు జరిగాయి.

టిటో యిక్కడికి బుధవారంనాడు వస్తారు. వారంరోజులపాటిక్కడే వుంటాడట.

తిరుపతి బిల్లుకు శాసనసభ ఆమోదం

వాల్తేరు, జూన్ 1

తిరుపతి విశ్వవిద్యాలయం బిల్లును నేటి సాయంత్రం ఆంధ్ర శాసనసభవారు ఆమోదించారు. ఈ బిల్లుపై చర్చతో పాటు ఇక్కడ శాసనసభసమావేశం కూడా నేడు ముగిసింది. బిల్లును సభవారు ఆమోదించిన మీదట అధ్యక్షులు శాసనసభను కాలనిర్ణయం లేకుండా వాయిదావేశారు. (వి. వి)

ప్రాథమిక విద్యా సంఘం సిఫార్సుల అమలుకు ప్రభుత్వ యత్నం

ఆంధ్రశాసనసభలో విద్యాశాఖామంత్రి హామీ

రాజాజీ విద్యావిధానం మాత్రం ఇక వుండదని స్పష్టీకరణ

వాల్తేరు, జూన్ 1

ప్రాథమిక విద్యా విచారణ సంఘంవారి సిఫార్సులను ఈ విద్యా సంవత్సరంనుంచి అమలుపరచడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విద్యామంత్రి శ్రీ బలుసు ప్రభాకర పట్టాభి రామారావుగారు నేడు ఆంధ్ర శాసనసభలో ప్రకటించారు.

నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల అనంతరం కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు లేచి, ప్రాథమిక విద్యా విచారణ సంఘంవారి నివేదికపై చర్చకు అవకాశం కల్పిస్తామని మంత్రిగారు యిచ్చిన హామీసంగతి ఏంజేశారని అడిగారు. "రేపో మాపో పాఠశాలలు తెరుస్తారు, శాసనసభా సమావేశాలు నేటితో ముగుస్తున్నాయి. అటువంటప్పుడు ప్రాథమిక విద్యా విచారణ సంఘం వారి సిఫార్సులను ప్రభుత్వంవారు అమలుపరుస్తారో లేదో, ఎప్పటినుంచి అమలుపరచ తలుచుకొన్నారో విశదీకరించవలసి వుంది" అని శ్రీ రాజగోపాలరావుగారన్నారు.

స్వతంత్ర సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు కూడా విద్యామంత్రి ఒక ప్రకటన చేయాలని కోరారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ తరిమెల నాగిరెడ్డిగారు లేచి జూన్ నెల వచ్చిందనీ, ఈ నెలలోనే పాఠశాలలు తెరుస్తారని, కనుక ప్రాథమిక విద్యా విచారణ సంఘంవారి సిఫార్సుల విషయంలో ప్రభుత్వవిధానం ఏమిటో వివరించవలసిన అవసరం వున్నదనీ అన్నారు.

రాజాజీ విధానానికి స్వస్తి!

సభ్యుల ప్రశ్నలకు విద్యామంత్రి పట్టాభిరామారావుగారు జవాబిస్తూ ప్రాథమిక విద్యావిచారణ సంఘంవారి సిఫార్సులను యీ నెలనుంచే అమలు జరపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏమయినప్పటికీ రాజగోపాలాచారిగారు ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం మాత్రం యిక ఉండదు అని ఆయన విస్పష్టంగా ప్రకటించారు.

విద్యా సంఘంవారి సిఫార్సులను యింకా ప్రభుత్వం పరిశీలించవలసి వున్నదనీ, ఆర్థిక వ్యవహారాలు మొదలైన వాటిని గురించి ఆలోచించవలసి వుందనీ ఆయన అన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ఉండరాదనే తాను మొదటినుంచీ అభిప్రాయ పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక విద్యావిచారణ సంఘంవారు కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చడం తనకు చాలా సంతోషం కలిగించిందన్నారు.

ఇప్పుడు యిటు మద్యనిషేధసమస్య, అటు తిరుపతి విశ్వవిద్యాలయ సమస్య యీ రెండు సమస్యల మధ్యనాపడి నలిగిపోతూండడంవల్ల తనకు విచారణ సంఘంవారి సిఫార్సులను పరిశీలించేటంత తీరిక చిక్కలేదని, మంత్రిగారు పేర్కొన్నారు.

విచారణ సంఘంవారి సిఫార్సులన్నీ ఏకగ్రీవంగా చేసిన సిఫార్సులవటంవల్ల అందులో సాధ్యమైనన్ని సిఫార్సులను తక్షణమే అమలు జరపడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.

1960 నాటికి ఆంధ్రదేశమందంతటా అక్షరాస్యతావ్యాప్తి కలగాలనే ప్రధాన ఆశయంతో విచారణ సంఘంవారు యీసిఫార్సులను చేయడం ముదావహం అని ఆయన వాకొన్నారు.

---

108 మైళ్ళ పొడవుగల భాక్రా కాలువను సోమవారంనాడు పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ భీమసేన్ సచార్ ప్రారంభోత్సవం చేశారు.

ఆగ్నేయాసియా సంధికి జపాన్ విముఖత

జపాను విదేశాంగ మంత్రి ప్రకటన

టోక్యో, మే 31

ఆగ్నేయాసియా కూటమి నిర్మాణాన్ని గురించిన సమాచారమేమీ తనకు అందజేయబడలేదనీ, అలాంటి కూటమిలో చేరవలసిందిగా జపాన్ దేశాన్ని యెవ్వరూ కోరలేదనీ, జపాన్ విదేశాంగమంత్రి కాట్సువో ఒకజాకీ, యీనాడిక్కడ జరిగిన విదేశాంగ వ్యవహారాల కమిటీసమావేశంలో అన్నాడు.

జపాన్‌గూడా ఆకూటమిలో చేరాలని యెవరైనా కోరినప్పటికీ, అది సాధ్యమౌతుందని తాననుకోవటంలేదని ఒకజాకీ అన్నాడు.

జపాన్ రాజ్యాంగం ప్రకారం యుద్ధం నిషేధించబడిందనీ, అంతేగాకుండా అలాంటి కూటమిలో జపాన్ చేరేందుకు వీలులేని కొన్ని పరిస్థితులూ, కారణాలూ వున్నాయనీకూడా ఆయన అన్నాడు.

జపాన్ ప్రధాని యోషిదా చేయబోతూన్న ప్రపంచ పర్యటనను గురించి ప్రస్తావిస్తూ, జపాన్ మధ్యా, ఆయన దర్శించబోయే దేశాల మధ్యా సుహృద్భావాన్ని స్థాపించి, అలా ప్రపంచ శాంతిసాధనకు సాయం చెయ్యటమే ప్రధానమంత్రి పర్యటనాశయమని ఒకజాకీ అన్నాడు.

కృష్ణారోడ్డు రెగ్యులేటర్

నిర్మాణానికి సాంకేతిక అనుమతి ఇవ్వబడిందని కేంద్రఉపమంత్రి అలగేశన్ వెల్లడి

విజయవాడ, జూన్ 1

కృష్ణారోడ్డు రెగ్యులేటర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సాంకేతిక సంబంధమైన అనుమతిని యిచ్చిందని రైల్వే రహదారులశాఖ ఉపమంత్రి శ్రీ ఓ. వి. అలగేశన్ నేడిక్కడ పత్రికా విలేఖరులకు తెలియచేశారు.

శ్రీ అలగేశన్ నిన్నరాత్రి యిక్కడకు వచ్చారు. ఇవాళ ఉదయం శ్రీ శ్రీ అలగేశన్ కృష్ణారోడ్డు రెగ్యులేటర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. కేంద్ర రహదారుల చీఫ్ యింజనీరు శ్రీ [illegible] మాత్రానీ, ఆంధ్ర రహదారుల చీఫ్ యింజనీరు శ్రీ జేమ్స్ [illegible], విజయవాడ సర్కిలు సూపరింటెండింగు యింజనీరు శ్రీ ఎ. ఎ. నరసింహారావు నాయుడు, కేంద్ర ప్రణాళికా ఉద్యోగి శ్రీ డి. ఆర్. భగత్ గార్లు కూడా శ్రీ అలగేశన్‌తోపాటు వచ్చారు.

వీరు మొదట రోడ్డు - రెగ్యులేటర్ బ్రిడ్జి నమూనాలను పరిశీలించారు. తరువాత రోడ్డు రెగ్యులేటర్ - బ్రిడ్జి నిర్మాణాన్ని, గుంటూరువైపు చేయబడుతున్న [illegible]

రోడ్డు రెగ్యులేటర్-బ్రిడ్జిపథకానికి సాంకేతిక సంబంధమైన అనుమతి ఇవ్వబడిందా? అని విలేఖరులు ప్రశ్నించగా అనుమతి ఇవ్వబడిందని, పని సాగిపోతున్నదని శ్రీ అలగేశన్ సమాధానమిచ్చారు.

మద్రాసు-కలకత్తా జాతీయరహదారులపై ఆంధ్రలో నిర్మించవలసిన రోడ్డు బ్రిడ్జిలను అలగేశన్ పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లాలో ఆలమూరు వంతెనను పరిశీలించారు.

శ్రీ అలగేశన్ ఇవాళ రాత్రికి కర్నూలు వెళ్ళి, రేపు తుంగభద్రపై నిర్మించబడే రోడ్డుబ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తారు.

భోపాల్‌లో నెహ్రూ

భోపాల్, మే 31

ప్రధాని నెహ్రూగారు ఢిల్లీనుంచి నేటి సాయంత్రం విమానంలో ఇక్కడకు వచ్చారు. ఆయనతోపాటు కేంద్ర రైల్వేమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి కూడా వచ్చారు.

రాజమండ్రి పేపరు మిల్లు మూసివేత

శాసనసభలో వాయిదా తీర్మానం త్రోసివేత

వాల్తేరు, జూన్ 1

రాజమండ్రి పేపరుమిల్లు మూతపడ్డం వలన ఏర్పడిన పరిస్థితిని చర్చించాలని కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ ప్రభాకరచౌదరిగారు నేడు ఆంధ్ర శాసనసభలో ప్రతిపాదించిన వాయిదా తీర్మానాన్ని డెప్యూటీ స్పీకర్ శ్రీ పసల సూర్యచంద్రరావుగారు త్రోసిపుచ్చారు.

రాజమండ్రి పేపరు మిల్లులో తయారు చేయబడిన కాగితాన్ని మద్రాసులో వున్న ఒక ఏజన్సీద్వారా పంచడం అవకతవకగా తయారైనందున కాగితం స్టాకులు విపరీతంగా పెరిగిపోయినవని శ్రీ చౌదరి తన తీర్మానంలో పేర్కొన్నారు. అంతేగాక మిల్లులో విరిగిపోయిన యంత్రాలను బాగు చేయలేదని అందుచేత మిల్లు మూతపడి కార్మికులు నిరుద్యోగులయ్యారని తెలిపారు.

డిప్యూటీ స్పీకర్ రూలింగు యిస్తూ మిల్లుమూసివేత ప్రభుత్వ బాధ్యత కాదన్నారు. ఈ సమస్య అత్యవసరమైనది కూడా కాదన్నారు. తీర్మానాన్ని త్రోసిపుచ్చారు.

ఫ్రెంచి, వియత్మిన్ సైన్యప్రతినిధుల సమావేశం ఏర్పాట్లు

జెనీవా, మే 31

ఫ్రెంచి, వియత్మిన్ సైన్య ప్రతినిధుల సమావేశాలకు అవసరమైన ఏర్పాట్లను చేయడానికి ఉభయ పక్షాల ప్రతినిధి వర్గాలలో వున్న సైనిక ప్రతినిధులు రేపు సమావేశం కాగలరని నేడు ప్రకటించబడింది.

సైన్య ప్రతినిధుల సభలో ఫ్రాన్సు తరఫున కర్నల్ మైకేల్ డి బ్రెబిస్సన్, వియత్మిన్ తరఫున కర్నల్ హా వాన్ లూ కర్నల్ తా కాంగ్ బూలు పాల్గొంటారు అని తెలుస్తుంది.

తుంగభద్ర జల విద్యుత్ కేంద్రం

నిర్మాణం 1957 సం॥నికి పూర్తి అవుతుందని ఉపముఖ్యమంత్రి వెల్లడి

వాల్తేరు, జూన్ 1

1957 సంవత్సరానికి తుంగభద్ర జలవిద్యుత్ కేంద్రనిర్మాణం పూర్తి అవుతుందని ఉప ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు నేడు శాసనసభలో శ్రీ టి. లక్ష్మీనారాయణ రెడ్డిగారు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

తుంగభద్ర జలవిద్యుత్ కేంద్రంలో ప్రారంభంలో 27 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుందనీ, తరువాత ఉత్పత్తి 63 వేల కిలోవాట్లకు పెరుగుతుందనీ సంజీవరెడ్డిగారు తెలియజేశారు.

తుంగభద్రనుండి విద్యుచ్ఛక్తి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సరఫరా చేయబడుతుందని సంజీవరెడ్డిగారు చెప్పారు.

చిత్తూరు జిల్లాకు, యితర జిల్లాలకు కూడ విద్యుచ్ఛక్తి సరఫరా చేసే విషయం ప్రభుత్వం ఆలోచించుతుందని సంజీవరెడ్డిగారు ఉప ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

భిక్షుక గృహాల నిర్మాణం

ఆంధ్రశాసన సభలో ప్రశ్నలు

వాల్తేరు, జూన్ 1

ఆంధ్రలోనున్న భిక్షుకుల ఉపయోగార్థం భిక్షుకగృహాలు నిర్మించితే ప్రభుత్వానికి చాలఖర్చు అవుతుందని, భిక్షుకులకు, అంగవైకల్యులకు ప్రత్యేక గృహాల నేర్పరచే పద్ధతి యితరరాష్ట్రాలలో నిరుపయోగమని తేలిందని సంజీవరెడ్డిగారు నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

ఉపముఖ్యమంత్రి శ్రీ స్వర్ణ వేమయ్యగారి ప్రశ్నకు జవాబు చెబుతూ భిక్షుకగృహనిర్మాణానికి సహాయం చెయ్యవలసిందని ప్రభుత్వానికి నెల్లూరునుండి ఎట్టి అభ్యర్థన రాలేదన్నారు.

ప్రభుత్వం సగం ఖర్చు, మున్సిపాల్టీ సగంఖర్చు భరించే పద్ధతిలో భిక్షుకగృహనిర్మాణానికి ఏదైనా మున్సిపాల్టీ సమర్పించే పథకాన్ని ప్రభుత్వం పరిశీలించగలదని ఉపముఖ్యమంత్రి శ్రీ సి. వి. కె. రావుగారి ప్రశ్నకు సమాధానమిచ్చారు. అటువంటి పథకాన్ని ఒకటి ప్రభుత్వానికి సమర్పించమని ఉపముఖ్య మంత్రి సి. వి. కె. రావుగారిని కోరారు.

తిరుపతి బిల్లుపై ఆంధ్ర శాసనసభ చర్చ

రెండేళ్ల వరకూ రాయలసీమ కాలేజీలను ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధం

చాలనే సవరణ ఆమోదం

వాల్తేరు, జూన్ 1

రాయలసీమకళాశాలలను రెండుసంవత్సరాల పర్యంతం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధించాలని తిరుపతి బిల్లుకు విద్యామంత్రి తెచ్చిన సవరణను సభవారు ఆమోదించారు. నేడు ఉదయం బిల్లులో 48 క్లాజులను ఆమోదించిన తర్వాత సభ మధ్యాహ్నం 1 గంటలకు వాయిదా పడింది.

తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బిల్లుపై నేడు తిరిగి క్లాజువారి చర్చ కొనసాగింది. డెప్యూటీ స్పీకరు శ్రీ పసల సూర్యచంద్రరావుగారు సభకు అధ్యక్షత వహించారు.

ఛాన్సలరుకు, వైస్‌ఛాన్సలరుకు సెనేటుకు సభ్యులను నామినేటుచేసే అధికారం ఉండరాదని శ్రీ సి. వి. కె. రావుగారు 15వ క్లాజుకు పెట్టిన సవరణపై వోట్లలెక్కింపు జరగాలని ముందు కోరారు. తీరా ఓట్లు లెక్కింపుకోసం సభాధ్యక్షులు [illegible] సమయానికి రావుగారు వెనుక్కుతగ్గారు.

విశ్వ విద్యాలయానికి మూడువేల రూపాయిలకు తక్కువకాని విరాళం యిచ్చిన సంస్థలు కాని, వ్యక్తులు కాని సెనేటుకు ఒక సభ్యుని నామినేటు చేయవచ్చునని అనివున్న సబ్‌క్లాజును తొలగించాలని శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు ప్రతిపాదించిన సవరణను విద్యామంత్రి ఆమోదించారు. అంతటితో 15వ క్లాజు పూర్తి అయింది.

సెనేటు హక్కుల సంఘం

తర్వాత 16వ క్లాజుపై చర్చ ప్రారంభమైంది. సెనేటు హక్కులను సంరక్షించటం వ్యవహారాలను చూడడానికి సెనేటునుంచి 8 మందిని ఎన్నుకొని ఒక హక్కుల సంఘాన్ని నియమించాలని శ్రీ సి. వి. కె. రావు గారొక సవరణ ప్రతిపాదించారు.

శ్రీ తరిమెల నాగిరెడ్డి, ఖండవల్లి [illegible] గార్లు ఈ సవరణను బలపరుస్తూ ప్రసంగించారు. ఆర్థిక మంత్రి విశ్వనాథంగారు ఈ సవరణను వ్యతిరేకించారు.

శ్రీ సి. వి. కె. రావుగారి సవరణపై ముందు మూజువాణీ వోటు తీసికొని వీగిపోయినట్లు అధ్యక్షులు ప్రకటించారు. కాని వోట్లలెక్కింపుజరగాలని ప్రతిపక్షసభ్యులు కోరగా 9 వోట్ల మెజారిటీతో సవరణ నెగ్గింది. సవరణకు అనుకూలంగా 47, ప్రతికూలంగా 38 వోట్లు వచ్చాయి. ఈ వోటింగులో శ్రీ సిద్ధన్నగౌడుగారు తప్ప మిగతా ప్రజాసోషలిస్టు సభ్యులంతా ప్రభుత్వ పక్షాన వోటు చేశారు.

శ్రీ గౌడుగారు ప్రతిపక్షంతో కలిసి వోటు చేశారు.

ఉపాధ్యాయనియామకాలను చేసేందుకు వైస్‌ఛాన్సలరు అధ్యక్షతను 5 గురు సెనేటు సభ్యుల సంఘాన్ని నియమించాలని శ్రీ ఎల్లమందారెడ్డిగారు (కమ్యూనిస్టు) ప్రతిపాదించిన సవరణవీగిపోయింది. 16వ క్లాజును సభవారామోదించారు. సెనేటు సమావేశాలకు సంబంధించిన 17వ క్లాజును కూడా పెద్ద చర్చ లేకుండానే ఆమోదించారు.

సిండికేటు నిర్మాణానికి సంబంధించిన 18వ క్లాజుకు ప్రభుత్వమే ఒక సవరణ ప్రతిపాదించగా ఆ సవరణతో సహా క్లాజు సభవారామోదించారు.

[మిగతా 4 వ పేజీలో]

తూర్పు బెంగాల్‌లో ఇప్పటికప్పుడే మూడు వందల మందికిపైగా అరెస్టు

నలుగురు మంత్రుల నిర్బంధం

వార్తా పత్రికలపై నిషేధాజ్ఞలు

కరాచీ, మే 31

తూర్పు పాకిస్తాన్‌లో యిప్పటికప్పుడే ప్రజారక్షణ చట్టం పేరుతో 300 మందికి పైగా అరెస్టుచేయబడ్డారని కరాచీకి చేరిన వార్తలనుబట్టి తెలుస్తోంది. ఐతే ఎవరెవరు అరెస్టు చేయబడ్డారనే సంగతి యింకా సరిగ్గా తెలియటంలేదు.

ఒక్క ఢాకా, నారాయణగంజ్ పట్టణాలలోనే 200 మందికి పైగా అరెస్టయినట్లు తెలుస్తోంది.

నలుగురు మంత్రుల నిర్బంధం

కరాచీ నుండి వెలువడే ఉర్దూ దైనిక పత్రిక 'నారోజ్' హక్ మంత్రివర్గంలోని పద్నాలుగురు మంత్రుల్లోనూ నలుగురు మంత్రులు అరెస్టు చేయబడ్డారని వ్రాసింది.

ముగ్గురు శాసనసభ్యుల అరెస్ట్

ఢాకా వార్తలనుబట్టి, తూర్పు బెంగాల్ శాసన సభలోని ముగ్గురు శాసన సభ్యులు - తూర్పు పాకిస్తాన్ అవామీ ముస్లింలీగ్ మాజీ కార్యదర్శి షేక్ ముజీబుర్, గణతంత్రీదల్‌కుచెందిన మరి యిద్దరు శాసన సభ్యులు - అరెస్టు చేయబడ్డారు.

పత్రికలమీద నిర్బంధం

ఢాకా, మే 31

ఢాకా పత్రికలమీద నిన్న విధించిన నిర్బంధం - ప్రచురించబోయే ముందు వార్తలనన్నిటినీ ప్రభుత్వానికి చూపించి సెన్సార్ చేయించాలనని - ఇంకా అమలులోనే వుంది.

ఢాకానుండి వెలువడే ఒక బెంగాలీ దిన పత్రిక 'మా జవాబు' అనే శీర్షిక క్రింద, నిరసన సూచకంగా పత్రికలో కొంతభాగంలో యేమీ ముద్రించకుండా, ఖాళీగా వుంచేసింది.

కలకత్తా దిన పత్రికలపై నిషేధం

ఈవేళ కలకత్తానుండి వచ్చిన రెండు యింగ్లీషు దిన పత్రికల కాపీలనన్నిటినీ ప్రభుత్వాధికారులు విమానాశ్రయంలోనే స్వాధీనపరచుకుని ప్రజలకు అందకుండా చేశారు. కాని ఒక పత్రిక కాపీలను మాత్రం, సాయంత్రంపూట విడుదల చేశారు.

కరాచీలో అరెస్టులు

పదిమంది కమ్యూనిస్టులు

ఇద్దరు 'డాన్' సంపాదకులు

కరాచీ, మే 31

తూర్పుబెంగాల్‌లో జరిగిన అల్లర్ల ఫలితంగా పశ్చిమ పాకిస్తాన్‌లోని పదిమంది కమ్యూనిస్టులు ప్రజారక్షణ చట్టం క్రింద అరెస్టు చేయబడ్డారు.

ఈవేళరాత్రి 'డాన్' పత్రిక సంపాదకవర్గ సభ్యుల్నికూడా అరెస్టుచేశారు. వారిలో, సహాయ సంపాదకుడిని పత్రిక కార్యాలయంలోనూ, సంయుక్త సంపాదకుడిని అతని యింటిలోనూ అరెస్టు చేశారు.

ఫజ్లుల్ హక్ గృహ నిర్బంధం

ఖలీకుజ్జమాన్ ప్రకటన

కరాచీ, మే 31

పదవీచ్యుతుడు కావించబడ్డ తూర్పు బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి ఫజ్లుల్ హక్ యింకా 'గృహ నిర్బంధం'లోనే వున్నాడు. ఆయన యింటి చుట్టూ, పాకిస్తాన్ రైఫిల్స్ దళం కాపలా కాస్తున్నది.

ఇప్పటివరకూ తూర్పు బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన చౌధురీ ఖలీకుజ్జమాన్, జనరల్ ఇస్కందర్‌కు చార్జి యిచ్చివేసినతర్వాత, ఈవేళ వుదయం కరాచీకి వచ్చాడు.

పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, ఫజ్లుల్‌హక్‌ను 'గృహ నిర్బంధం'లో వుంచామనటం సరికాదని, ఐతే యిల్లు వదలొద్దని ఫజ్లుల్‌హక్‌ను ఆదేశించిన మాటవాస్తవమేననీ ఖలీకుజ్జమాన్ అన్నాడు.

తూర్పు బెంగాల్ గవర్నర్ విజ్ఞప్తి

అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల 'సహాయం' కావాలని

కరాచీ, మే 31

"తూర్పు పాకిస్తాన్‌లోని అల్ప సంఖ్యాక జాతులకు చెందిన ప్రజల కష్టాలను తొలగించేందుకు" సహాయం చేస్తానని వాగ్దానం చేస్తూనూ, సహాయం చేయవలసిందిగా ప్రార్థిస్తూనూ, తూర్పు బెంగాల్ గవర్నర్ మేజర్ జనరల్ ఇస్కందర్ మిర్జా, తూర్పు బెంగాల్ సరిహద్దున వున్న అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కబురుపెట్టినట్లు తెలియవస్తోంది.

అల్పసంఖ్యాక జాతులవారు 'గౌరవప్రదమైన జీవితాన్ని' గడపేందుకు అవసరమైన అవకాశాలనన్నిటినీ కలుగజేసేందుకు తూర్పు బెంగాల్ ప్రభుత్వం సంసిద్ధంగా వున్నదనీ, ఆ అల్ప సంఖ్యాక జాతుల మాన, ప్రాణాలను తన మాన, ప్రాణాలుగా యెంచుకుంటాననీ కూడా ఇస్కందర్ మీర్జా తెలియచేశాడట.

ఐతే, సరిహద్దునవున్న అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలనుండి ఈ క్రొత్త గవర్నర్ కోరుతూన్న 'సహాయం' యేమిటో, యే విధమైనదో తెలియటంలేదు. కమ్యూనిస్టుల చర్యలను అరికట్టటమూ, వ్యాపారం మొదలైన సమస్యలను పరిష్కరించటమూ బహుశా యీ 'సహాయం'లోని భాగాలు అయివుండవచ్చునని, యిక్కడి రాజకీయాభిజ్ఞులు అంటున్నారు.

'కరపత్రాల వర్షం'

గవర్నర్ ప్రభుత్వ నిర్ణయం

ఢాకా, మే 31

ఈవేళగూడా తూర్పు బెంగాల్‌లో సైనికులూ, పోలీసులూ గస్తీ తిరుగుతూనే వున్నారు.

ఇంతవరకూ పరిస్థితి ప్రశాంతంగానే వున్నదని తూర్పు పాకిస్తాన్ అధికార వర్గాల వారంటున్నారు.

రేపటినుండి, 'కరపత్రాల కార్యక్రమం' కొనసాగించాలని తూర్పు బెంగాల్ గవర్నర్ ప్రభుత్వం నిర్ణయం చేసింది. హక్ ప్రభుత్వాన్ని రద్దుచేసేందుకు గల కారణాలను వివరిస్తూ, పాకిస్తాన్ ప్రధాని మహమ్మదాలీ నిన్న చేసిన రేడియో ప్రసంగాన్ని బెంగాలీ భాషలోనికి అనువదించి, వేలకొద్దీ కాపీలను తూర్పుబెంగాల్ అంతటా పాకిస్తాన్ విమానాల సాయంతో విరజిమ్మాలని ప్రభుత్వం నిశ్చయించుకొన్నది.

ఇతర జిల్లాల నుండి పోలీసులు

వాల్తేరుకు రప్పించబడలేదని శాసన సభలో వివరణ

వాల్తేరు, జూన్ 1

వాల్తేరులో అసెంబ్లీ సమావేశ సమయంలో రక్షణ కార్యకలాపాలకుగాను ప్రభుత్వం యితర జిల్లాల నుంచి పోలీసు కానిస్టేబుల్స్‌ను తీసుకురాలేదని ఉపముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు నేడు ఆంధ్ర శాసన సభలో శ్రీ స్వర్ణ వేమయ్యగారి ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.

సి.వి.కె.రావుగారి ప్రశ్నకు ప్లానింగ్ శాఖామంత్రి శ్రీ సంజీవయ్యగారు సమాధానం చెబుతూ, ప్రతి జిల్లాలోను ప్లానింగ్, డెవలప్‌మెంటు బోర్డులను నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ బోర్డులు త్వరలో నెలకొల్పబడుతాయన్నారు.

ప్రగడ కోటయ్యగారి ప్రశ్నకు మంత్రి జవాబు చెబుతూ, సహకార శాఖలో క్రింది తరగతి ఉద్యోగులకై సహకార శిక్షణా స్కూలును నెలకొల్పాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు.

మరొక ప్రశ్నకు శ్రీ సంజీవరెడ్డిగారు జవాబు చెబుతూ, ఆంధ్ర రాష్ట్రంలో నాలుగు విద్యుచ్ఛక్తి సప్లయి జోన్లు వున్నవన్నారు. మొదటి జోన్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలు వున్నవన్నారు. రెండవజోన్‌లో కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలున్నాయి. మూడవ జోన్‌లో నెల్లూరుజిల్లా, నాలుగవ దానిలో చిత్తూరు జిల్లా వున్నది.

బాగ్దాద్‌లో భారత రాయబారిగా వున్న శ్రీ ఖుబ్‌చంద్, జోర్డాన్‌లోకూడా రాయబారిగా నియమించబడ్డారు.

ఎస్.ఎస్.ఎల్.సి పరీక్షా ఫలితాలు

'విశాలాంధ్ర' పత్రికకు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షా ఫలితాలు సప్లయి చేయమని కోరేటందుకు మా విలేఖరి మద్రాసులో డిపార్టుమెంటు కమీషనరును కలుసుకొని మాట్లాడగా, అందుకాయన నిరాకరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయ పరీక్షా ఫలితాలు ప్రకటించబడిన 'విశాలాంధ్ర' ప్రతులను చూపినప్పటికీ, ఆయన ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షా ఫలితాలు పంపడాని కంగీకరించ లేదు. అందువలన ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షాఫలితాలను 'విశాలాంధ్ర'లో ప్రకటించలేక పోతున్నాం.

—సంపాదకవర్గం

'1954 జూన్ 2 బుధవారం
జయ సంవత్సర
జ్యేష్ఠ శుద్ధ
పాడ్యమి ఉ. 7 - 21
మృగశిర రా. 7 - 31

విశాలాంధ్ర

2-6-54 బుధవారం

అవకతవక నిర్ణయం

ఆంధ్రశాసనసభ్యుల్లో అధిక సంఖ్యాకులు తిరుపతి విశ్వకళా పరిషత్తును వెన్వెంటనే అనుబంధ సంస్థగా చేయాలన్న మంత్రివర్గ నిర్ణయాన్ని ఆమోదించరని స్పష్టంకాగానే, మంత్రివర్యులు తాత్కాలికంగా గండం తప్పించుకోడానికి ఒక మెట్టుదిగి వచ్చారు. రెండు సంవత్సరాల వరకు దాన్ని గురుకుల విద్యాపీఠంగానుఉంచి,తర్వాత అనుబంధ సంస్థగాను ఉంచాలని ఒక సవరణ ప్రతిపాదించారు.అదిశాసనసభచే ఆమోదించబడినట్లు ప్రకటింపబడింది. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు తిరుపతి విశ్వకళా పరిషత్తును చివరవరకూ గురుకులసంస్థగానే ఉంచాలన్న సవరణ ఐదు వోట్ల తేడాతో వీగిపోయింది.

అంతవరకూ ప్రభుత్వ పక్షాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ప్రజాసోషలిస్టు సభ్యులు ప్రభుత్వ పక్షంతో కలిసి వోటుచేయడమే యిందుకు కారణం.

రెండేళ్ళవరకూ తిరుపతి విశ్వకళా పరిషత్తును గురుకుల సంస్థగాను, ఆ తర్వాత అనుబంధ సంస్థగాను వుంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనలో హేతువాదంగాని, సిద్ధాంతంగాని కనపడదు. ఒకే భాషాప్రాంతంలో రెండు అనుబంధ విశ్వవిద్యాలయాలుండడం హానికరమనే వాదనను అంగీకరిస్తే, మొదటినుంచి చివరవరకూ దాన్ని గురుకుల విద్యాపీఠంగా ఉంచాలి; అలాకాక, గురుకుల విశ్వవిద్యాలయంగా చేస్తే ఆర్థిక చిక్కులుంటాయని విచారణ సంఘ సభ్యులు చెప్పిన వాదనను అంగీకరిస్తే, మొదటినుంచీ దాన్ని అనుబంధ విశ్వవిద్యాలయంగానే ఉంచాలి. ఈ రెండింటిలో దేన్నంగీకరించడానికీ ధైర్యం లేక, మొదట గురుకుల సంస్థగాను, తర్వాత అనుబంధ సంస్థగాను ఉంచాలని మంత్రివర్గంచేసిన నిర్ణయం కొద్దిమంది శాసనసభ్యుల్ని తమవైపు తిప్పుకొని తాత్కాలికంగా గండం గడిచి బయటపడ్డానికేనని స్పష్టమవుతోంది.

ఇది పచ్చి అవకాశవాదంతో కూడుకున్న అవకతవక నిర్ణయం.

ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధింపబడియున్న నెల్లూరుజిల్లా కళాశాలలను తిరుపతి విశ్వకళా పరిషత్తుకు అనుబంధించాలనే ప్రభుత్వ ప్రతిపాదన నాలుగువోట్ల మెజారిటీతో మాత్రమే నెగ్గింది. ఇది నెల్లూరుజిల్లా వారికి తీరని అపకారం చేయడమే.

మంత్రివర్గం కొద్దివోట్ల తేడాతో తన పంతం నెగ్గించుకోగలిగిందంటే, ప్రజాసోషలిస్టు సభ్యుల సహకారంతోనే. వీరు మొదటినుంచీ ఆంధ్ర శాసనసభలో ప్రతి ముఖ్య సమస్యమీద ఊగిసలాడ్డం, చివరకు ప్రభుత్వ పక్షంలో చేరడం పరిపాటి అయింది. రాజధాని సమస్యపై వీరనుసరించిన పంథా ఎక్కడికి దారితీసిందో మనందరికీ తెలుసు. తిరుపతి విశ్వకళా పరిషత్తుపై కూడా వీరు మంత్రివర్గాన్ని బలపరచి, పై అవకతవక నిర్ణయానికి కారకులయారు. వీరి అవకాశవాద పంథా జాతి శ్రేయస్సు కెంత హాని కలిగిస్తోందో ఆంధ్రప్రజలు గ్రహించగలరు.

తిరుపతి విశ్వకళా పరిషత్తుకు హైకోర్టుజడ్జి ఛాన్సలర్ గా ఉండాలనే సవరణను శాసనసభ మెజారిటీ వోటుతో ఆమోదించడం ప్రశంసనీయమైనవిషయం.

నూతన సంవత్సరంలో ఆంధ్రదేశంలో మరొక విశ్వవిద్యాలయం అవతరిస్తూన్నందుకు ఆంధ్ర ప్రజలందరితోబాటు సంతోషం ప్రకటిస్తున్నాం. ఆంధ్రుల విద్యాభివృద్ధి కది యితోధికంగా దోహదమీయగలదని ఆశిస్తున్నాం.

తిరుపతి విశ్వవిద్యాలయానికి ఛాన్సలరుగా ప్రధాన న్యాయమూర్తి

ఆంధ్ర శాసనసభ నిర్ణయం

నెల్లూరు కళాశాలలను తిరుపతికి చేర్చరాదన్న సవరణ 4 వోట్ల తేడాతో ఓటమి

[విశాలాంధ్ర విలేఖరి]

నాత్తేరు, మే 31

ఆంధ్ర శాసనసభవారు నేడు విశ్వవిద్యాలయాల పాలనలో ఒక నూతన సంప్రదాయాన్ని నెలకొల్పారు. విశ్వవిద్యాలయాలన్నింటికీ ఆయా రాష్ట్రగవర్నరులే ఛాన్సలర్లుగా వ్యవహరించడం ఇంతవరకూ ఆచారంగా వస్తూవుంది. కాని తిరుపతి విశ్వవిద్యాలయానికి మాత్రం ఆంధ్ర ప్రధాన న్యాయమూర్తి ఛాన్సలరుగా వుంటారు.

గవర్నరుకు మారుగా ప్రధాన న్యాయమూర్తి ఛాన్సలరుగా ఉండాలన్న ఒక సవరణను ప్రజాసోషలిస్టు సభ్యుడు శ్రీ నడింపల్లి నరసింహారావు గారు ప్రతిపాదించారు. మంత్రులూ, ప్రభుత్వ పక్షసభ్యులూ, ఈ సవరణకు ఎంతో ప్రతిఘటనచూపించారు కాని ఫలితం లేకపోయింది. సవరణకు అనుకూలంగా 55 ప్రతికూలంగా 52 వోట్లు రావడంతో ప్రభుత్వానికి పరాజయం తప్పలేదు.

అంతకు ముందు తిరుపతి విశ్వవిద్యాలయ ఆధ్వర్యాన ఉండదగు కళాశాలలను నిర్వచించే క్లాజు చర్చకు వచ్చినప్పుడు నెల్లూరు కళాశాలలను తిరుపతి విశ్వవిద్యాలయమునుండి మినహాయిస్తూ శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారు ప్రతిపాదించిన సవరణ వీగిపోయింది.

నేడు ఆంధ్ర శాసనసభలో తిరుపతి బిల్లుపై తిరిగి చర్చ ప్రారంభం కాగానే విద్యామంత్రి పట్టాభిరామారావు గారు అనుబంధ కళాశాలలకు సంబంధించిన ఒక ప్రభుత్వ సవరణను ప్రతిపాదించారు. నెల్లూరు,అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరుజిల్లాలలోని కళాశాలలను తిరుపతి విశ్వవిద్యాలయానికి 1956 విద్యాసంవత్సరం నుంచీ అనుబంధించాలి అని ఆ సవరణలో పేర్కొన్నారు. 1956 వరకూ తిరుపతిలో గురుకుల విశ్వవిద్యాలయాన్ని మాత్రమే స్థాపించి, ఆ తర్వాత దాన్ని అనుబంధ విశ్వవిద్యాలయంగా కూడా మార్చాలన్న సవరణను అంగీకరించడంవల్ల ఈ సవరణ అవసరమైనదని విద్యామంత్రి అన్నారు.

నెల్లూరును మినహాయించాలి

అంతట శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారు అదేక్లాజుకు ఒక సవరణ ప్రతిపాదించారు. తిరుపతి విశ్వవిద్యాలయానికి అనంతపురం, కడప, కర్నూలు చిత్తూరు జిల్లాల కళాశాలలను మాత్రమే అనుబంధించాలని ఆ సవరణలో ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్ష సభ్యులందరూ ఈ సవరణను బలపరుస్తూ ప్రసంగించారు.

తొలుత శ్రీ ఖండవల్లి కృష్ణారావు గారు మాట్లాడుతూ నెల్లూరు భవిష్యత్తు రాజకీయ జూదగాళ్ళ చేతుల్లో పడినట్లు కనిపిస్తోందన్నారు. కళా విజ్ఞాన రంగాల్లో రాజకీయాలను చొప్పించడం ఉచితం కాదన్నారు. నెల్లూరు కళాశాలలు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆధ్వర్యాననే ఉండాలన్నారు.

రాజకీయాల్లో పనిచేసే వారందరినీ రాజకీయ జూదగాళ్ళనడం సభామర్యాద కాదని కాంగ్రెసు సభ్యులు శ్రీ బాడాల కృష్ణమూర్తిరావుగారన్నారు.

ఈ సందర్భంలో రాజకీయ జూదగాళ్లు అనడం సముచితంగానే ఉందని శ్రీ నాగిరెడ్డిగారన్నారు.

తర్వాత శ్రీ కృష్ణారావుగారు తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ నాగరికత అభివృద్ధి పొందడం ఈ జూదగాళ్ళకు ఏమాత్రమూ ఇష్టంలేదన్నారు. నెల్లూరు ఎంతో అభివృద్ధి కాగల జిల్లా అనీ, ఎంతోమంది అగ్ర నాయకులు నెల్లూరు జిల్లానుంచి వచ్చారని అన్నారు.అక్కడి వీరందైన కళాశాల పెంపొందక పోవడానికి కారణం ఈరాజకీయ జూదగాళ్లేనని అన్నారు. కళాశాలల్లో నిరంకుశత్వం పెరిగి పోతోందనీ, తాను అనంతపురం కళాశాలకు వెళ్ళినప్పుడు విద్యార్థుల మీద విధించే ఫీజు ఈ నిరంకుశత్వానికి ప్రతిబింబంగా గోచరించిందని ఆయన పేర్కొన్నారు

"నేడు నెల్లూరు విద్యార్థులకు చాల ప్రమాదం వాటిల్లుతోంది. నెల్లూరు విద్యార్థులకు మద్రాసు కళాశాలల్లో స్థానం కలుగచేయండి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వసతి కల్పించండి. అంతేకాని ఏమీ అభివృద్ధి చెందని విశ్వవిద్యాలయంతో మాత్రం ముడి పెట్టకండి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉప్పూ - ఊరగాయా

శ్రీ క. వరదాచారిగారు (కాం) మాట్లాడుతూ రెండేళ్ల తర్వాత తిరుపతి విశ్వవిద్యాలయంలో చేరడంవల్ల నెల్లూరు విద్యార్థులకు వచ్చేనష్టం ఏమీలేదన్నారు. ఖండవల్లివారి వాదనలో ఉప్పు ఊరగాయ ఏమీలేదన్నారు.

శ్రీ బసవారెడ్డి శంకరయ్యగారు (కమ్యూనిస్టు) ప్రసంగిస్తూ నెల్లూరును చీల్చడం భావ్యంకాదన్నారు.

శ్రీ సి. వి. క. రావుగారు ప్రసంగిస్తూ నెల్లూరును చీల్చరాదని ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ వెల్లడించిన అభిప్రాయాన్ని మంత్రుల దృష్టికి తెచ్చారు

నెల్లూరును చీల్చడంవల్ల నష్టంలేదని వరదాచారిగారంటున్నారు. కాని అలా చీల్చడంవల్ల కలిగే లాభంఏమిటి అని శ్రీ జి.సి. కొండయ్యగారు ప్రశ్నించారు.

శ్రీ వరదాచారిగారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు బాడాల కృష్ణమూర్తిరావుగా రన్నారు.

పులిహోరా - చెక్కెర పొంగలి

శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు ప్రసంగిస్తూ యిలా అన్నారు :

రెండవ విశ్వవిద్యాలయాన్ని ఏర్పరుస్తున్నప్పుడు ఆంధ్ర దేశ ఐక్యతను కాపాడాలన్న మా వాదనలో వరదాచారిగారికి ఉప్పూ ఊరగాయా కనిపించ లేదు. వారి వాదనలో పులిహోరా, చక్కెరపొంగలీ అగుపడ్డున్నదా?

నెల్లూరును ఇప్పుడే చీల్చడంలో అర్థం ఏమిటి? రెండు సంవత్సరాలు అయిన తర్వాత ఈ విషయం చూసుకోవచ్చునుకదా? ఆనాడు గెలుపుసాధ్యం కాదని ప్రభుత్వం భయపడుతున్నదా?

అంతట శ్రీ కందప్ప రామశేషంగారు లేచి ఈ విషయంలో నెల్లూరు శాసన సభ్యులఅభిప్రాయంతీసుకోవాలన్నారు.

తర్వాత ప్రతిపక్ష నాయకులు శ్రీ నాగిరెడ్డిగారు మాట్లాడుతూ నెల్లూరును చీల్చడానికి ప్రభుత్వం ఎందుకు తలపెట్టిందో అర్థం అవడంలే దన్నారు. అందుకనే ఇది రాజకీయ జూదం అని ఖండవల్లి కృష్ణారావుగారు చేసిన వ్యాఖ్య చాలాసమంజసంగా వుందన్నారు. ఆయన యింకా ఇలా అన్నారు :

గురుకుల విశ్వవిద్యాలయాన్ని గురించి ఇందరు మాట్లాడారు కాని అందులో వుండదగ్గ చదువును గురించి ఒక్కరూ చెప్పలేదని ప్రకాశంపంతులు గారన్నారు. కాని నెల్లూరును ఎందుకు చీల్చ ప్రయత్నిస్తున్నారో మాత్రం పంతులుగారు చెప్పలేదు.

నెల్లూరును చీల్చాలని ప్రభుత్వం ఎందుకు సంకల్పించిందో తమకు అర్థం అవడంలేదని విశ్వ విద్యాలయం కమిటీ వారన్నారు. అయితే రోజు రోజూ ఈ నాటకాన్ని చూస్తూన్న మనకు అది అర్థం అవుతోంది. కోటిరెడ్డిగారు తల ఊపుతున్నారు. రాయలసీమకు నాలుగు జిల్లాలే వున్నాయే అయిదవది ఎందుకు ఉండరాదని ప్రభుత్వం వారు తలపోసి వుంటారు. అందుకని బాగా విద్యాభివృద్ధిని పొందిన నెల్లూరును చీల్చాలని ప్రయత్నిస్తున్నారు.

సంజీవరెడ్డిగారిని చూస్తేనే కవిత్వం

నెల్లూరును చీల్చరాదని ఆంధ్రవిశ్వవిద్యాలయ సెనేటువారు ఏకగ్రీవంగా తీర్మానించారు. అలా చీల్చడం అతి దారుణమనీ, నష్టకరమని, ప్రజాభిప్రాయం దృష్ట్యాచూస్తే అలాచేయ తగదని చెప్పారు.

శ్రీ సంజీవరెడ్డి : తాము సెనేట్ సమావేశానికి వెళ్ళలేదని చెప్తున్నారు. అయితే తమరు ప్రయోగించే పదజాలం ఏమిటి? ఓహో ఏమికవిత్వం!

శ్రీ నాగిరెడ్డి : సంజీవరెడ్డిగారిని చూసినప్పుడల్లా ఆకవిత్వం పుట్టుకొస్తుంది, వారుచేసేపనులు చూస్తువుంటే ఏడవలేక నవ్వవలసి వస్తోంది.

నెల్లూరును చీల్చడంవల్ల కొత్త విశ్వవిద్యాలయానికి డబ్బు సర్దుబాటు అవుతుందంటారా? అది అన్యాయం. ఈ చర్యవల్ల నెల్లూరు విద్యార్థులకు హాని కలుగుతుంది. ఈ విషయంలో నెల్లూరు శాసనసభ్యుల అభిప్రాయాలను తెలుసుకొన్నారా? ఇప్పటికైనా మంత్రిగారు తమప్రయత్నాలను విరమిస్తారని భావిస్తున్నాను. అలా భావించడం పొరపాటే కావచ్చును. అయినప్పటికీ నేను ఆశిస్తున్నాను.

గమోపాఖ్యానం !

మంత్రి పట్టాభి రామారావు : ప్రతిపక్ష నాయకుని మాటలువింటూవుంటే నాకు చిన్నవాడు చూసిన గమోపాఖ్యానం జ్ఞాపకం వస్తోంది.

మేం సూచించినదానిలో రాజకీయ వైషమ్యాలేమీ లేవు. రాయలసీమకు తిరుపతి విశ్వవిద్యాలయం ఉండాలని చెప్పినవారు ప్రతిపక్షసభ్యులేకదా ?

ప్రతిపక్ష సభ్యులు విద్యావేత్తలను శంకించారు. ప్రభుత్వాన్ని దూషించారు. కాని నెల్లూరును రాయలసీమతో ఎందుకు జతచేర్చాలన్నామో వారు గుర్తించటంలేదు. నెల్లూరు తిరుపతికి దగ్గరగావుంది. అందుకని చేర్చాలంటున్నాం.

నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారి అభిప్రాయం అడిగాము. నెల్లూరు కళాశాలను తిరుపతి విశ్వవిద్యాలయం క్రిందికి తెచ్చేందుకు వారు ఒప్పుకున్నారు.

శ్రీ నాగిరెడ్డి : ప్రజాభిప్రాయం తెల్పడానికి అంతకన్నా మంచి వ్యక్తి మరొకరు మీకు దొరకలేదా ?

అంతట శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారి సవరణను సభాధ్యక్షులు మూజువాణీ వోటుకు పెట్టి నెగ్గినట్లు ప్రకటించారు. అప్పుడు సవరణపై వోట్ల లెక్కింపు జరగాలని ప్రభుత్వం కోరగా సభాధ్యక్షులు సవరణను వోటుకు పెట్టారు.

సవరణకు అనుకూలంగా 56 ప్రతికూలంగా 60 వోట్లు వచ్చాయి. 4 వోట్ల తేడాతో సవరణవీగిపోయింది, అధ్యక్షులు తిరిగి ప్రకటించారు. శ్రీ సిద్ధన్నగౌడుగారు తప్ప ప్రజాసోషలిస్టు సభ్యులందరూ ప్రభుత్వంతో కలిసి సవరణకు వ్యతిరేకంగా వోటు చేశారు.

తర్వాత నాల్గవక్లాజునుంచీ తొమ్మిదవ క్లాజువరకు ఎక్కువ చర్చలేకుండా క్లాజులన్నిటినీ సభవారు ఆమోదించారు.

నడింపల్లివారి సవరణ

అంతట ప్రజాసోషలిస్టు సభ్యుడు శ్రీ నడింపల్లి నరసింహారావుగారు 10 వ క్లాజుకు ఒక సవరణ ప్రతిపాదించారు. తిరుపతి విశ్వవిద్యాలయానికి ప్రధాన న్యాయమూర్తికాని, రిటైరు అయిన ప్రధాన న్యాయమూర్తికాని ఛాన్సలరుగా వుండాలని ఆసవరణలో పేర్కొన్నారు.

ఇంతవరకూ విశ్వవిద్యాలయానికి రాష్ట్రగవర్నరే ఛాన్సలరుగా వుండడం సంప్రదాయం. ఆ సంప్రదాయం ప్రకారమే బిల్లు రూపొందించబడింది.

ప్రతిపక్ష నాయకులు శ్రీ తరిమెల

(మిగతా 8 వ పేజీలో)

హక్ మంత్రివర్గం రద్దుకు అమెరికన్ల కృషి

కరాచీలోని అమెరికన్ రాయబారి హిల్డ్రెత్ వహించిన పాత్ర

న్యూఢిల్లీ, మే 30

తూర్పు బెంగాల్ లో హక్ మంత్రివర్గాన్ని రద్దుచేయటంలో, కరాచీలోని అమెరికన్ రాయబారి హిల్డ్రెత్ చాలా ప్రముఖపాత్ర వహించాడనీ, అతని మూలాన్నే యీ నిర్ణయం జరిగిన దన్నా అతిశయోక్తి వుండదనీ కరాచీలోని వున్నతాధికార వర్గాలవారూ, దౌత్యవర్గాల సంబంధీకులూ, విదేశ పత్రికా విలేఖరులూ అభిప్రాయ పడుతున్నారు.

తూర్పు పాకిస్తాన్ లోయే విషమ ఫలితాలు కలుగుతాయోనని భయంతో పాకిస్తాన్ ప్రధాని మహమ్మదాలీ నిన్నటివరకూ తీవ్రమైన చర్యలు తీసికొనేందుకు సంకోచిస్తూనే వున్నాడని యీ వర్గాలవారంటున్నారు. కాని తర్వాత, యీ విషయాన్నిట్లా వదలివెయ్యకూడదనీ, ఖచ్చితంగా నిర్ణయం చేసికొని తూర్పుబెంగాల్ ను నిరంకుశంగా పరిపాలించవలసిన దేననీ, అవసరమైతే తూర్పుబెంగాల్ గవర్నర్ స్థానంలో యింకొక గట్టిమనిషిని నియమించి,ఆప్రాంతాన్ని సైనికవిధానంతో పరిపాలించాలెననీ మహమ్మదాలీకి సలహా లిచ్చారు. మేజర్ జనరల్ ఇస్కందర్ మీర్జాను తూర్పుబెంగాల్ గవర్నరుగా నియమించటంగూడా విదేశీయుల సూచనప్రకారమే జరిగినదని తెలుస్తూంది.

అమెరికా-పాకిస్తాన్ సైనికసంధికీ, టర్కీ-పాకిస్తాన్ సంధికీగూడా సూత్రధారుడు యీ ఇస్కందర్ మీర్జాయే. అందుచేతనే అమెరికనులకు అతనంటే అంత నమ్మకం.

అమెరికన్లకు తూర్పు బెంగాలే ప్రధానసైనిక కీలుస్థానం

ఇకనుండి తూర్పు బెంగాలే పాకిస్తాన్ లోని ప్రధాన అమెరికన్ సైనిక స్థావరమైపోతుందని కరాచీ వర్గాలవారంటున్నారు. తూర్పు బెంగాల్ ఎన్నికలలో పాకిస్తాన్ పాలకవర్గాల పార్టీ ముస్లింలీగుకు పుట్టగతులు లేకుండా పోయినప్పుడే, ఐక్యసంఘటన దిగ్విజయం సాధించినప్పుడే, అమెరికనులీ నిర్ణయం తీసికొన్నారు. అప్పటినుండీ ఐక్యసంఘటనను విచ్ఛిన్నం చేసేందుకూ, లేకుంటే మంత్రివర్గాన్ని రద్దు చేసేందుకూ యెప్పుడవకాశం దొరుకుతుందా అని కాచుకూర్చున్నారు. ఐక్యసంఘటనను విచ్ఛిన్నం చెయ్యటం సాధ్యం కాక పోయేప్పటికే, యిప్పుడు మంత్రివర్గాన్నే రద్దు చేసేశారు.

తూర్పు బెంగాల్ మీదనే కన్నువేసేందుకు కారణం

అమెరికా తూర్పు బెంగాల్ మీదనే కన్నువేసేందుకు కారణం ఆ రాష్ట్రంలో ముస్లింలీగేతర ప్రభుత్వం యేర్పడటం వొక్కటే కాదనీ, ఆసియాలో అమెరికా వేసే యెత్తుగడల ప్రకారం ఆగ్నేయాసియా సైనికసంధి యేర్పడితే, యీప్రాంతంలో తూర్పు బెంగాల్ చక్కని కీలకప్రాంతం కాగలదనే ప్రధానవుద్దేశంతోనే హక్ మంత్రివర్గాన్ని రద్దుచేసేందుకు అమెరికన్లు సమకట్టారని తెలియవస్తోంది.

500జీతం చాలదని 1000 లకు పెంచుకోవడమే మీ విధానమా?

దుగ్గిరాల ఉప ఎన్నిక సభలో శ్రీ చంద్రమౌళిగారికి సూటి ప్రశ్న

తెనాలి, మే 31

"రు. 500 జీతాలు చాలవని రు 1000 లకు పెంచుకోవటమే మీ విధానమా" అని దుగ్గిరాల ఉపఎన్నిక ప్రచార సందర్భంలో అత్తోట గ్రామంలో కాంగ్రెసు మాజీ మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళిగారిని గ్రామస్థులు ప్రశ్నించారు.

శ్రీ చంద్రమౌళిగారికి ఈ ప్రశ్నతో పచ్చి వెలక్కాయ గొంతుకుపడ్డట్లు అయింది. ఎవరు ప్రశ్న అడిగారో కూడా చూడకుండానే, కోపంతో ఆయన శివాలు తొక్కారు. సరియైన సమాధానం చెప్పకుండానే ఈ ప్రశ్న అడగటం "అల్లరి" అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెసు నాయకులు ఓట్ల కొరకు ప్రజలను సమీపిస్తే వచ్చే అనేకచిక్కు ప్రశ్నలలో ఇదొకటి.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు వచ్చి వెళ్ళిన తరువాత కాంగ్రెసు అభ్యర్థి శ్రీ మేడూరు నాగేశ్వరరావు గారు మాత్రమే నియోజక వర్గంలో ప్రచారం చేస్తున్నారు. "నేను మీకులం వాణ్ణి"అని చెప్పుకోవటంతప్పితే మరొక "రాజకీయం"లేని స్థితిలో వీరు పడ్డారు. నిన్న మొన్న చంద్రమౌళిగారు ప్రచారంలోకి దిగారు. వీరు జరుపుతున్న సమావేశాలకు ప్రజలు హాజరవటం గగనంగా ఉంది. వ్యవసాయ కూలీలవద్దకు వెళ్ళే ధైర్యం ఎవరికీ కన్పించటం లేదు. ఎవరి దగ్గరకు పోయి ఓట్లడిగితే ఏమి ప్రశ్నలు వేస్తారో అనే భయం కాంగ్రెసు ప్రచారకులను వెన్నాడుతోంది. స్థానికంగా ఎందుకో ఒకందుకు కాంగ్రెసులో ఉన్నవారు కూడా, ప్రజలకు దూరంగా ఉండి తాము కాంగ్రెసు వాదుల మంటూరేగాని, ప్రజల మధ్యకు వచ్చి ఓట్లు అడిగే స్థితి లేదు. నాయకులంతవారే ప్రజలకు మొగం చూపలేకపోతున్నారు. గనుకఇకమంత్రులనరంగంలోకి దింపవలసిందే నని కాంగ్రెసువాదు లనుకుంటున్నారు. చివరి రోజుల్లో "డబ్బుసంచులు" రాకుండా పోతాయా అనే ధీమాతో ఎదురు చూస్తున్నారు.

ఇదమిద్ధంగా తేలని కృషిక్ లోక్ పార్టీ స్థితి

"నేను ఈమని గ్రామవాసిని; ఆచార్యరంగాగారి ఆశీర్వాదంతో నిలబడ్డాను." అన్న తొలిపలుకులతో ఒకకరపత్రంవేసి, కృషిక్ లోక్ పార్టీ అభ్యర్థి తన ప్రచారం ప్రారంభించాడు. 1952 కు పూర్వం "గ్రామసేవదళాలు" నిర్మించి ప్రజలను హింసించుటలో గొప్ప పేరు ప్రఖ్యాతులుపొందిన మాజీసబిన్స్పెక్టరు గాదిరెడ్డి హనుమంతరావుగారు కృషిక్ పార్టీ కారులో ఊరేగటాన్ని ప్రజా సామాన్యం ప్రత్యేకంగా గమనిస్తున్నారు.

"గత ఎన్నికలముందు కాంగ్రెసు జండా, గత ఎన్నికలలో కంకుల కాపాయి జండా, ఇప్పుడు నాగలి జండా - ఎన్నిమార్పులు! " ఇవి ప్రజల నోటనుండి వెలువడుతున్న మాటలు.

గత ఎన్నికలలో డిపాజిట్టు కూడా కోల్పోయిన కృషిక్ లోక్ పార్టీ అభ్యర్థి ఇప్పుడు పోటీ చేయడం అనవసరమని, లోక్ పార్టీ అభిమానులు అనుయాయులు అంటున్నారు. అభ్యర్థిని ఉపసంహరింపజేయాలని పైనాయకులకు నొక్కి చెబుతున్నారు.

గ్రామ గ్రామానికి కమ్యూనిస్టుపార్టీ ప్రచారం

కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ లావుబాల గంగాధరరావుగారు, ఎన్నికల కమిటీ అధ్యక్షులు శ్రీ గుడిబండ వెంకటేశ్వర రెడ్డి, సభ్యులైన శ్రీ లంకిరెడ్డి వెంకటరెడ్డి గార్లు, శ్రీ రావి అమ్మయ్య, కోగంటి కోటయ్య, పూసబండి ఆచార్యులు యింకా యితర ముఖ్యులతో నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను పర్యటించి గ్రామాల్లో ప్రజలందరిని ముఖ్యులందరిని కలుసుకొన్నారు.

ఈ పర్యటనానుభవాలను చర్చించుటకు పోలింగ్ ప్రాంతాల బాధ్యతలు ప్రచార కార్యక్రమం నిర్ణయించు కొనుటకు 31వ తేదీన దుగ్గిరాలలో ఎన్నికల కమిటీ సమావేశమైంది. శ్రీ బొల్లిముంత శివరామకృష్ణగారు నియోజక వర్గంలోని పరిస్థితులను సమీక్షించారు.

కమ్యూనిస్టు అభ్యర్థి ప్రచారానికి వెళ్ళిన ప్రతిచోట వ్యవసాయ కూలీలు కాంగ్రెస్ పరిపాలనలో తమ జీవిత పరిస్థితులు ఏవిధంగా దుర్భరమైపోయిందీ తెలియజేసి కమ్యూనిస్టుపార్టీపై తమ విశ్వాస ప్రకటన చేస్తున్నారు. రైతాంగ ప్రజలు కాంగ్రెసు అవలంబించిన అధికపన్నుల విధానం పట్ల కృష్ణా వాగ్దానాల పట్ల అసంతృప్తి వెల్లడించుతున్నారు. కౌలుదార్లచట్టం తెస్తామంటూ కళ్ళనీళ్ళు తుడుస్తున్నారని నిరసన తెల్పారు. రాజధాని, హైకోర్టు, మద్యనిషేధం - ఏఒక్క విషయంలోను ప్రజాభిప్రాయాన్ని కాంగ్రెసు గమనించలేదని సర్వత్రా ఫిర్యాదుచేశారు.

కమ్యూనిస్టుపార్టీ వైపు మొగ్గు

కల్లభాపురం, మున్నంగి మున్నగు గ్రామాలు ఇంతవరకు కాంగ్రెస్ అభిమానగ్రామాలు. ఈగ్రామాలలోనివారు ఒక వైపున గతరెండేళ్లుగా కాంగ్రెసు రాజకీయాలను, రెండవ వైపున కమ్యూనిస్టుపార్టీ ఎసెంబ్లీలోనుబయటా చేస్తున్న పోరాటాలను గమనించారు. కమ్యూనిస్టు పార్టీనే వీరిప్పుడు బలపరచటానికి సంసిద్ధత వెల్లడించుకున్నారు. మా పూర్తి సహకారం ఉంటుందని చెబుతున్నారు. ఈ ఉదాహరణ ఒక్కటే చాలు, వారి అభిమానులు సైతం ఏవిధంగా కాంగ్రెసు వారి ప్రజావ్యతిరేక విధానాలకు రోజు రోజు విముఖులౌతున్నారో చూపడానికి.

జూన్ 30 వ తేదీన మంచికలపూడిలో నియోజక వర్గంలోని కమ్యూనిస్టు కార్యకర్తల సమావేశం జరిగింది. ఇంతవరకు జరిగిన ప్రచారాన్ని సమీక్ష చేసుకొని, తరువాత కార్యక్రమం నిర్ణయించుకొని కార్యకర్తలు తమ తమ ప్రాంతాలకు వెళ్ళారు. (వి. వి.)

దాసరి మైకా గనిలో కార్మికుల తొలగింపు

రాపూరు, మే 30

నెల్లూరుజిల్లా రాపూరు తాలూకా పొక్కుండల గ్రామంలో దాసరిమైకా గని చాలకాలంగా పని చేస్తోంది. గనికి చుట్టుపక్కల గ్రామాలవారు మొలకలపూండ్ల గ్రామస్థులు ఎక్కువ మంది పనికి వెళ్ళుతుంటారు.

చుట్టుపట్ల గనుల్లో యిస్తున్న రేట్లు యీగనిలో యివ్వడంలేదు. బోనసులు గాని, గత ఎవార్డులవలనఏర్పడిన స్వల్ప సౌకర్యాలుగాని అమలుచేయుటలేదు. ఈ సౌకర్యాలు అడిగినందుకుగాను కొంతమందిని యిటీవల పనినుండి తొలగించారు. లేబర్ వుద్యోగులకు అర్జీలు పంపారనే అనుమానంతో 18-5-54 వ తేదీన 27 మంది మొలకలపూడి గ్రామస్థులను తొలగించారు. యిది నిబంధనలకు వ్యతిరేకమని తెలిసి ఉండికూడా గని మేనేజరు యీవిధంగా తొలగించారు. లేబర్ అధికారులకు తెలియజేశారనే కక్షతో కార్మికులను అనేక యిబ్బందుల పాల్జేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే కలుగ జేసుకొని తగు న్యాయం సమకూర్చాలని కార్మికులు కోరుతున్నారు.

సూయజ్ ప్రాంతంలో బ్రిటిష్ సైనికుని హత్య

ఇస్మాలియా, మే 30

సూయజ్ కాలువ వొడ్డునవున్న ఇస్మాలియా నగరపు పేటలలో ఒక చోట కొందరు ఈజిప్షియనులు ఒక బ్రిటిష్ సైనికుణ్ణి చంపేశారు.

ఆ సైనికుడు ఒక ఈజిప్షియన్ డ్రైవరును అరెస్టుచేసి తీసుకుపోతూండగా ఈ ఘటన జరిగింది.

పెట్లూరు

కందుకూరు తాలూకా పెట్లూరులో మే 26వ తేదీన బహిరంగసభ జరిగింది. శ్రీ చెంచురెడ్డి బాలిరెడ్డిగారు సభకు అధ్యక్షతవహించారు. శ్రీ క. చౌడారెడ్డిగారు ఉపన్యసిస్తూ, నందికొండ ప్రాజెక్టుపై వ్యతిరేకంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను విమర్శించారు. పిమ్మట పెట్లూరు, పమిడిపాడుదళంవారిచే 'కూలీ' అను బుర్రకథ చెప్పబడింది.

లేఖలు

సిద్దారెడ్డిపాలెం చెర్వు అధ్వాన్నస్థితి

మహాశయా!

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా సిద్దారెడ్డిపాలెం దేవస్థాన గ్రామం. దానికి బుచ్చిరెడ్డిపాలెం దొడ్లవారు ధర్మకర్తలు. ఈ గ్రామానికొక చిన్న చెర్వుఉంది. ఆ చెర్వుక్రింద షుమారు 400 యకరాలుదాకా ఆయకట్టుంది.

సదరు చెర్వుకు పై చెర్వులనుండి, పొలాలనుండి వచ్చే నీటివరవ వొకటి ఉంది. చెర్వులోకి పోగా మిగిలిన నీళ్లు కలుజుగుండా పోయి "పైడేరు" అను పేరుతో ప్రవహిస్తాయి.

సదరు ఏరు, చెర్వుకు ఉత్తరంవైపు ప్రవహిస్తుంది. ఎంతో ఆందోళన చేసిన ఫలితంగా, పదిసంవత్సరాల క్రితం, అక్కడొక బోడకలుజు, ఒక పెద్ద తూము కట్టారు. అయితే ఆ బోడకలుజు, ట్యాంకుబెడ్ లెవెల్ కు 2, 3 అడుగులు తక్కువ కట్టారు. చెర్వులోకి నీరుపోయే తూము గూడా చాలా చిన్నది కట్టారు. బాగా వర్షాలు పడి, పెద్ద ప్రవాహమొస్తే, చెర్వులోకి కొంచెం నీళ్ళు వస్తాయి. లేకపోతే, ట్యాంకు బెడ్ లెవెల్ కంటే కలుజు మట్టం చాలా తక్కువ కనక, చెరువులోకి నీళ్లుపోవు. పైగా చెరువులోని నీళ్లుగూడా వెనక్కి వస్తాయి. అందుకనే రైతులు తూమువద్ద కాచుకొని ఉండి, ప్రవాహమున్నంతసేపు (చెర్వులోకి నీరు ఎక్కినంతసేపు) తూము చెక్క ఎత్తిపెట్టి, మరలా ప్రవాహంతగ్గి చెర్వులోని నీరు వెనక ముఖం పట్టగానే మూసివేస్తూఉంటారు. అదైనా తూము కొంచెం పెద్దదిగానైనా ఉంటే, ఆ కొద్ది ప్రవాహకాలంలో చెర్వు నింపుకోవచ్చును. ప్రవాహకాలం కొద్దే కనుక, చాలా కొద్దినీళ్ళు మాత్రమే చెర్వులోకి పోతాయి.

ప్రతి సంవత్సరము రైతులంతా తట్టలు నెత్తిన కట్టుకొని కలుజుకు మట్టి, కంప అడ్డం వేసుకొంటారు. షుమారు 3 అడుగుల ఎత్తుకుపైగావేస్తే గాని లాభంలేదు. అది కొద్ది ప్రవాహాన్నే ఆపగలదు. బాగా వర్షాలుపడి పెద్ద ప్రవాహమొస్తే, కొట్టుకొని పోతుంది. ఈ కలుజు లెవెల్ పెంచినందువలన పై పొలాల వారికి కూడా ఎట్టి నష్టమూలేదు. రైతులు 3, 4 అడుగుల కట్టపోసినను పై పొలాలకు నీరు ఎగతట్టలేదు. ఈ రైతులు ప్రతి సంవత్సరం నానా అవస్థలకు గురౌతున్నారు.

కనుక బోడకలుజుమట్టాన్ని ఇంకొంచెం ఎత్తుకట్టి, రెగ్యులేటరు తూమును ఇంకొంచెం పెద్దదిచేస్తే, చెర్వు త్వరగా నిండుతుంది. చెర్వులో నీరు గూడా సమృద్ధిగాఉండి పంటలు పుష్కలంగా పండగలవు.

పైగా చెర్వుకట్ట, వరదపొర్లుగట్టు, తూములు బొత్తిగా అధ్వాన్నంగా వున్నాయి తూములకు చెక్కలు పూర్తిగా చెడిపోయివున్నాయి. ఇవన్నీ గూడా తక్షణమే బాగుచేయించవలసియున్నది.

అయితే చెర్వుస్థితి యింత అధ్వాన్నంగా ఉంటే, ఎస్టేటుదార్లు ఏమీ పట్టించుకోవటంలేదు. రైతులెంత ఆందోళనచేసినా పెడచెవిని పెడుతున్నారు. కనుక ప్రభుత్వంవారు ఈ విషయమై వెంటనే విచారించి, చెర్వు, కలుజు మరమ్మత్తులకు పూనుకోవాలి. లేనియెడల రైతులు చాలా అవస్థలకు లోనవుతారు.

అల్లంపాటి రామచంద్రారెడ్డి,
అధ్యక్షుడు,
నెల్లూరుజిల్లా రైతుసంఘం,
కావలి.

మంగళగిరిలో నీటి సరఫరా

మహాశయా !

మంగళగిరిలోని 25 వేల మంది జనాభాకు మంచినీటి సరఫరా సక్రమంగా లేనందున ప్రజలు విపరీతంగా బాధపడుతున్నారు. ప్రజలు ఆందోళన చేసిన మీదట పంచాయితీ అధికారులు రెండు లారీలతో నీటిని ప్రస్తుతం సరఫరాచేస్తున్నారు. అయితే ఆఫీసర్లకు, వారి బంధుమిత్రులకు ధారాళంగా నీరు పోసి మిగిలిన వారి కళ్ళనీళ్లు తుడవటానికి ఒక్కొక్క బిందె నీరు యిస్తున్నారు. ఇంకా ఎక్కువ లారీలతో నీటిసప్లయి చేయాలనీ, నీటి పంపకంలో పక్షపాతాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

ఇట్లు
ఆకుల శివరామకృష్ణయ్య,
మంగళగిరి.

'స్వతంత్ర తెలంగాణా' నినాదం తెలుగుజాతికి హానికరం

ఫజులాలీ కమిషనుకు సమర్పించిన నివేదికలో పి. డి. యఫ్. స్పష్టీకరణ

హైదరాబాదు, మే 30

హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించి పరిసర భాషా ప్రాంతాల్లో కలిపివేయాలనీ, స్వతంత్ర తెలంగాణా నినాదం హానికరమైందనీ హైద్రాబాదు పీపుల్సు డెమోక్రటిక్ ఫ్రంట్ అసెంబ్లీపార్టీ ఫజులాలీ కమిషనుకు సమర్పించిన తన నివేదికలో స్పష్టీకరించింది.

ముఖ్యంగా హైదరాబాదు విచ్ఛిత్తి, నిజాం పదవీ భ్రష్టత, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణ ప్రాతిపదికపై మేము 40 స్థానాలు హైదరాబాదు అసెంబ్లీలో సంపాదించి ప్రధాన ప్రతిపక్షాన్ని యేర్పరిచామని చెప్పారు.

హైదరాబాదును విభజించాల్సిన ఆవశ్యకతను గురించి చెప్తూ, హైద్రాబాదొక హింసాగారమనీ, అదెలాంటిదనిగాని అచ్చటవున్న అరాచకం గురించిగాని హైద్రాబాదులోనివసించనివారికి తెలియడంకష్టమనీ, భట్రాజు పొగడ్తలనే ప్రధానంగా బెట్టుకునే కొందరు వ్యక్తులు, గ్రూపులు మధ్యయుగాలనాటి దక్కను జమీందారీ సంస్కృతిని గురించి గొప్పగా పొగిడియుండవచ్చునుగాని అధికసంఖ్యాక ప్రజలకు చెప్పుకోడానికి కన్నీటికథలు తప్ప మరేమీలేవనీ, అంచేతనే ఈరాష్ట్రాన్ని విభజించాలని ప్రజలు కంకణంకట్టుకున్నారనీ వివరించారు.

కొందరు తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుజేయాలనికోరడం, రాష్ట్రవిభజన ఉద్యమాన్ని దెబ్బకొట్టుటకుచేస్తున్న ప్రయత్నాల్లోని భాగమేనని చెబుతూ యీ నినాదం అసంబద్ధమేగాక ఆర్థికంగా, సాంస్కృతికంగా, సాంఘికంగాకూడ తెలుగుజాతిని నష్టపర్చేటమేగాక తెలుగుజాతి అభివృద్ధిని ఆటంకపరుస్తుందని తెలియచేశారు.

భాషారాష్ట్ర విభజన వలన దేశం విచ్ఛిత్తి కాదు

సంయుక్త మహారాష్ట్ర సభలో డాక్టర్ పరంజపే ఉద్ఘాటన

బొంబాయి, మే 30

విదేశ వ్యవహారాలు, దేశ రక్షణ, ఆర్థిక విషయాలు, రవాణా, ఎగుమతి దిగుమతులు మొదలైన జాతీయ జీవనానికి సంబంధించిన ముఖ్య వ్యవహారాలన్నీ కేంద్ర ప్రభుత్వమే చూస్తున్నందువల్ల, భాషారాష్ట్ర విభజన భారతదేశ విచ్ఛిత్తికి దారి తీస్తుందనే వాదనలో పసలేదని ఆస్ట్రేలియాలో భారత హైకమీషనర్‌గా పనిచేసిన డాక్టర్ పరంజపే నేడిక్కడ ఉద్ఘాటించారు.

సంయుక్త మహారాష్ట్ర పరిషత్ ఆధ్వర్యాన జరిగిన దక్షిణ బొంబాయి సంయుక్త మహారాష్ట్ర సభకు డాక్టర్ పరంజపే అధ్యక్షత వహించారు. ఈ సభ సంయుక్త మహారాష్ట్ర నిర్మాణాన్ని గూర్చి ప్రచారం చేయడానికి ఏర్పాటు చేయబడింది.

రాష్ట్ర సరిహద్దుల సమస్య సుహృద్భావ పూర్వకంగా పరిష్కరించాలి గనుక, సరిహద్దు సమస్యల పరిష్కారానికి ఫజులాలీ సంఘం కొన్ని నిర్దుష్టమైన సూత్రాలను రూపొందించాలి అని డాక్టర్ పరంజపే కోరారు.

జగ్గయ్యపేట పంచాయితీబోర్డు అవకతవకలు

కమ్యూనిస్టు సభ్యుల తీవ్ర ఆక్షేపణలు

జగ్గయ్యపేట, మే 28

కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పంచాయితీబోర్డు సమావేశం మే 25 వ తేదీన శ్రీసామినేని విశ్వనాథంగారిఅధ్యక్షతను జరిగింది.

31 అంశాలతో కూడిన ఎజండా మే 11 వ తేదీన బోర్డుసభ్యులకు పంపబడింది. దానిలో వరసగా మూడు సమావేశాలకు రాని సభ్యులు కందిబండ పిచ్చయ్య, రొయ్యూరి కనకయ్యగార్ల సభ్యత్వంను రద్దుచేస్తూ చేసిన తీర్మానానికి 4 గురు కమ్యూనిస్టు సభ్యులు వ్యతిరేకంగాను, విశ్వనాథం (గత ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా గెలిచి, పార్టీనిర్ణయాలకు, ప్రజాశ్రేయస్సుకు భిన్నంగా లంచగొండి ఉద్యోగులకు మద్దతు ఇచ్చిన వ్యక్తి) ముఠావారు 5 గురు అనుకూలంగాను, ఒకరు తటస్థంగాను ఓటుచేశారు.

తర్వాత యింకా పంచాయితీబోర్డు ఖర్చులకు సంబంధించిన అంశాలు చాలవుండగా, అవన్నీ వరుసగా చదివి ప్యాసు చేయించ ప్రయత్నించారు. ఓసన్నలో 6 వ వార్డులో మట్టిదిబ్బలు తీసిన దానికి రూ. 7½ లు ఖర్చుపెట్టి రూ. 35-0-0 లు ఖర్చుపెట్టినట్లు చదవగా, దానిని కమ్యూనిస్టుసభ్యులు ఆక్షేపించారు. ఆ విషయం మరుసటి సమావేశానికి వాయిదా వేయబడింది. బస్సుస్టాండులో మంచినీళ్ళ చలివేంద్రం లేకుండానే ఏప్రిల్, మే, జూన్ నెలలకు డబ్బు శాంక్షను చేయాలని వచ్చి మోసంగా ప్రతిపాదిస్తే, బస్సుస్టాండులో చలివేంద్రమేలేదని ఎదిరించేసరికి, అదికూడ మరుసటి సమావేశానికి వాయిదా వేయబడింది.

అలాగే కబేలా మరమ్మతుకు రు. 60-0-0లుఖర్చుపెట్టి రు.245-0-0లు శాంక్షను కోరారు. ఇదంతా టౌన్ ప్లానింగు ఓవర్సీరు అవినీతి చర్యఅనీ, దానిని ఆమోదించరాదనీ పుల్లయ్యగారు, యితర కమ్యూనిస్టు సభ్యులు వ్యతిరేకించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుజారీచేసిన ఇళ్ళ స్థలాల తొలగింపు నోటీసులపై బోర్డు ఏ చర్య తీసుకోకుండా ఆపుచేస్తూ తీర్మానించాలని కోరగా, అదికూడ మరుసటి సమావేశానికి వాయిదా వేయబడింది.

శానిటరీ యినస్పెక్టరు లంచగొండితనాన్ని గురించి వచ్చిన అర్జీపై బోర్డు తీర్మానం చేయుటకు బదులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారికి అధికార మిస్తూ తీర్మానించారు. బోర్డు చర్య తీసుకోవాలని కమ్యూనిస్టుసభ్యులు వాదిస్తేబోర్డుకు హక్కులేదని త్రోసివేశారు. (వి.వి.)

రాష్ట్ర పంచాయితీ మహాజన సభ

ప్రయాణభత్యం వగైరాల విషయమై ప్రభుత్వ ప్రకటన

రాజమండ్రి, మే 29

ఆంధ్రరాష్ట్ర పంచాయితీ సంఘ నూతన కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకొనడానికి, జూన్ 27 వ తేదీన రాజమండ్రిలో మహాజనసభ జరుపుకొనడానికి ఆంధ్ర ప్రభుత్వంవారు అనుమతించారు.

ఈ సందర్భంలో ప్రభుత్వంవారు చేసిన ప్రకటనలో ఇంకా ఇలా వుంది.

సంవత్సరానికి రూ 500 లు పైన ఆదాయంవచ్చే పంచాయితీలన్నీ మహాజనసభకు ఒక ప్రతినిధిని పంపవచ్చు.

ఈ దిగువ పేర్కొన్న ప్రకారం ప్రతినిధులు పంచాయితీ ద్రవ్యం నుండి మహాసభ ప్రయాణ భత్యాలు వెచ్చించవచ్చు.

రైల్వే ప్రయాణం అయినట్లయితే, రాను పోను మూడవ తరగతి టిక్కెట్ల వెల; రోడ్డు ప్రయాణమైతే బస్సు చార్జి ఎంతైతే అంత; దినభత్యం రోజుకు రూ 2/- లు.

ప్రతి ప్రతినిధి, రూ 5/- లకు యెక్కువ కాకుండా పంచాయితీ ద్రవ్యంనుండి అనుబంధరుసుం వెచ్చించవచ్చు.

నాపడా

శ్రీకాకుళం జిల్లా నాపడా బోర్డు ఉన్నత పాఠశాల శంకుస్థాపనోత్సవం, మాధ్యమిక పాఠశాల ప్రారంభోత్సవం మే 25 వ తేదీన జిల్లా కలెక్టరు శ్రీ యం. పి. కరియప్పగారిచే జరుపబడ్డాయి. ఈసందర్భంలో శ్రీ చెన్నూరు భాస్కరరావుగారు కలెక్టరుకు ఒక వినతిపత్రం సమర్పిస్తూ, చావనపాడు రేవును అభివృద్ధి చేయాలని, చాకలి సోడా ఫ్యాక్టరీ నిర్మించాలని కోరారు.

వడ్డినేనివారిపాలెం

నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకా వడ్డినేనివారిపాలెంలో మే 24 వ తేదీన జరిగిన బహిరంగసభకు శ్రీ గాలి కొండయ్యగారు అధ్యక్షత వహించారు. శ్రీ కె. చౌడారెడ్డిగారు నందికొండ ప్రాజెక్టు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను వివరించారు. తరువాత పమిడిపాటి సిద్దయ్యదళంవారిచే 'కష్టజీవి' బుర్రకథ చెప్పబడింది.

సుగాలీ నాయకునిపై భూస్వాముల చిత్రహింస

పత్తికొండతాలూకా ఉప్పర్లపల్లె ప్రాంతంలో

[విశాలాంధ్ర విలేఖరి]

పత్తికొండ, మే 28

కర్నూలుజిల్లా పత్తికొండ తాలూకా ఉప్పర్లపల్లె బాటతండా సుగాలీ నాయకుడు శ్రీ నానే నాయక్ గారు, ఆ ప్రాంతంలోని కాంగ్రెసు భూస్వాముల ముఠాచే చిత్రహింసలకు గురిచేయబడ్డారు. ఆయన పత్తికొండ ఆసుపత్రిలో వున్నారు. ఆయన పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

కాంగ్రెసు భూస్వాములుచేసే దోపిడీలు, దౌర్జన్యాలు, అన్యాయాలను అరికట్టించడంలో శ్రీ నానే నాయక్ గారు ప్రముఖపాత్ర వహించారు. వెనకబడిన సుగాలీప్రజలలో సంఘీభావం, సంఘచైతన్యం కలిగించారు. ఇది గిట్టని భూస్వాములు శ్రీ నానేనాయక్ గారిని చిత్రహింసలు పెట్టారు.

గత సోమవారం తెల్లవారు జామున ఇంటి బయలులో పడుకొనివున్న శ్రీ నానే నాయక్ గారిని భూస్వాముల రౌడీముఠా అకస్మాత్తుగా వచ్చి పట్టుకొన్నారు. భూస్వాముల సమక్షంలోనే శ్రీ నానేనాయక్ గారిపై చిత్రహింసలు జరిగాయి. తనను హింసించిన రౌడీలను గుర్తించగలనని శ్రీ నానే నాయక్ గారు యిచ్చట మ్యాజిస్ట్రేటుతో అన్నారు. తల కోసి పారవేయవలసిందని ఒక భూస్వామి, ప్రాణం తీయకుండా కుంటిగా చేసి వేయాలని వేరొక భూస్వామి రౌడీలను ఆదేశించారనికూడ శ్రీ నాయక్ గారు చెప్పారు.

ఎముకలన్నీ విరగ బొడిచారు

శ్రీ నాయక్ గారిని ఎత్తుకొని వెళ్ళుతున్న సమయంలో అడ్డం తిర్గిన అతని అన్న నానేనాయక్‌ను, మరొక వ్యక్తిని రౌడీలు బుర్ర పగులగొట్టారు. ఈ విషయం పై అధికారులకు ఫిర్యాదు చేయబడింది.

శ్రీ నాయక్ గారిని ఆసుపత్రిలో కలుసుకోగా, ఆయన ఇలా అన్నారు.

"రౌడీలు నన్ను రాళ్ళతో, కట్టెలతో విపరీతంగా కొట్టినారు. రోడ్డులో వంక దగ్గరకు తీసుకొని పోయినారు. అచ్చట నా కాలుకింద రాయిపెట్టి, కాలును అదిమి పట్టుకొన్నారు. పైనుంచి కట్టెతో యిష్టమొచ్చినట్లు కొట్టినారు. తరువాత ఒక పెద్ద రాయి తెచ్చి కాలిమీదవేసినారు. కాలు పిక్కకండ సగం తెగిపోయింది. తరువాత రెండు చేతులు పురితిప్పినారు. ఒక చేతిని ఇద్దరు గట్టిగా అదిమి పట్టుకొని, మిగతావాండ్లు పైనుంచి గట్టిగా కట్టెలతో కొట్టినారు. ఎముకలు కరకర శబ్దమిస్తున్నాయి. విరిగివుంటాయి. నా తలమీద బలమైన దెబ్బకొట్టినారు. ఆ వంకలోనుంచి ఉప్పర్లపల్లెకు నన్ను ఈడ్చుకొని పోయినారు. కొంతదూరం పోయిన తరువాత, ఒక బావికి సమీపంలో, తెలివితప్పి పడిపోయినాను. నానోట్లో మన్నుపోసి మరల కొట్టినారు. అక్కడనుంచి నన్ను ఒక యింటి దగ్గరకు తెచ్చి పడవేసినారు. ఆ తరువాత సాయంత్రం మూడు గంటలకు హెడ్ కానిస్టేబుల్ వచ్చి నన్ను విచారించినాడు. అతనితో జరిగిన సంగతులన్నీ చెప్పినాను".

నందికొండ ప్రాజెక్టును వాయిదావేసే ప్రమాదం

ఆంధ్ర ప్రజలు నిరంతరాందోళన ద్వారా కేంద్రప్రభుత్వంపై వత్తిడి తేవాలని విజ్ఞప్తి

వాల్తేరు, మే 30

ఆర్థిక కారణాల సాకుతో నందికొండ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం వాయిదా వేయడానికి చూస్తోందనీ, ఆంధ్ర ప్రజలు నిరంతరాందోళన కొనసాగించి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి వాయిదా వేసే ప్రయత్నాలను విరమించుకొనేట్టు చేయాలనీకోరుతూ ఆంధ్రరాష్ట్ర నందికొండ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి శ్రీ మాదాల నారాయణస్వామిగారు యీ దిగువ పత్రికా ప్రకటన చేశారు.

బహుళ ప్రయోజనకారియగు నందికొండ ప్రాజెక్టు త్వరలో ఆరంభిస్తుందని ఆంధ్ర ప్రజానీకం ఆశించింది. కానీ యిటీవల ఆంధ్ర పార్లమెంటుసభ్యులు కేంద్ర ప్రభుత్వపు మంత్రులను కలుసుకొనగా నందికొండ ప్రాజెక్టును ఆర్థిక కారణాల వలన పంచవర్ష ప్రణాళికలో చేర్చే అవకాశం లేదని చెప్పినట్లుగా తెలుస్తున్నది. ఇదే కేంద్ర ప్రభుత్వపు నిర్ణయమైనచో ఆంధ్ర ప్రజానీకానికి తీరని నష్టం వాటిల్లును. నందికొండ ప్రాజెక్టును ఖోస్లాకమిటీసిఫార్సుచేయుటయేగాక ఆంధ్రదేశంలో గత రెండు సంవత్సరాల్లోను పెద్ద యెత్తున యీ సమస్యపై ఆందోళన జరిగింది. ఫలితంగా ఆంధ్ర హైద్రాబాద్ ప్రభుత్వాలు జాయింటు రిపోర్టును గూడ అందించినవి. ఇక వివరాలతో కూడిన రిపోర్టును మాత్రం ఆంధ్ర ప్రభుత్వం పంపించ వలసివుంది. యీ స్థితిలో నందికొండ ప్రాజెక్టు సమస్య దాదాపు బాలారిష్టదశలన్నీ దాటి ఒక స్వరూపము తీసుకొనుచున్నదని ఆంధ్ర ప్రజానీకం భావిస్తున్నది.

ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక కారణాల సాకుతో నందికొండ ప్రాజెక్టు సమస్యను వాయిదా వేయాలని తలంచడం కేవలం అన్యాయం. దీనిని ఆంధ్రప్రజలు సహించరు. ఆంధ్రదేశం నలువైపులా సభలు సమావేశాలు జరిపి కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ తీర్మానాలుచేసి టెలిగ్రాములు, జాబులద్వారా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన వత్తిడి తీసుకురావాలని కోరుతున్నాను.

బావులకోసం యిచ్చిన సబ్సిడీలు

వాయిదా విషయం ఆలోచిస్తామని రెవిన్యూమంత్రి ప్రకటన

వాల్తేరు, మే 31

నేడు అసెంబ్లీలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ యస్. కాశిరెడ్డిగారి ప్రశ్నకు జవాబు చెబుతూ రెవిన్యూ మంత్రి శ్రీ కోటిరెడ్డిగారు, నెల్లూరు జిల్లాలో సబ్సిడీ క్రింద 10348 బావులకు అప్పు లివ్వబడ్డాయనీ, అందులో 2731 బావుల సబ్సిడీలు 'రికవర్' చేయవలసి వున్నదని, 1467 బావులకిచ్చిన సబ్సిడీలు వసూలు చేయబడ్డాయనీ అన్నారు.

కాశిరెడ్డిగారి వుప ప్రశ్నకు జవాబుగా, సబ్సిడీల వసూలు విషయంలో ప్రభుత్వం వుదారంగా వుందన్నారు. అయినా వసూలు మరి కొంతకాలం, ఏమూడు మాసాలో, వాయిదా వేయాలంటే ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

శ్రీ రావు వెంకట జగ్గారావు: జాయింటు పట్టాలున్నవారికి యీ సబ్సిడీలక్రింద అప్పులివ్వడంలేదు. వీరికి కూడా యిచ్చేలా ప్రభుత్వం ఆలోచిస్తుందా?

జవాబు: ఆలోచిస్తాం.

శ్రీ వావిలాల: గుంటూరు జిల్లాకు కూడా వాయిదా వర్తిస్తుందా?

జవాబు: నేను వాయిదా యిస్తే రాష్ట్రం అంతటికీ యిస్తాను!

(వి. వి.)

గుంటూరు జిల్లాలో పొగాకు నిల్వలు

విడుదల విషయంలో ఆంధ్ర శాసనసభలో ప్రశ్నలు

వాల్తేరు, మే 31

నేడు అసెంబ్లీలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ మాదాల నారాయణస్వామిగారి ప్రశ్నకు వచ్చిన ఉపప్రశ్నకు జవాబు చెబుతూ వ్యవసాయమంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారు గుంటూరు జిల్లాలోని పొగాకు నిల్వలపై రివెన్యూబోర్డు సభ్యుడు (శ్రీయం. పి. పాయి) పంపిన నివేదిక రహస్యమైనదనీ, అందువలన శాసనసభకు అందజేయ వీలులేదనీ అన్నారు.

శ్రీ మాదాల నారాయణస్వామి: కనీసం ఆ రిపోర్టులోని ప్రధానాంశాలైనా వివరిస్తారా?

జవాబు: ప్రస్తుతంవున్న 'మార్కెటింగ్ యార్డులు' నిలుపుదలచేసి, పరిస్థితి పరిశీలించి తగుమార్పులతో వచ్చే సీజను నుండి రాష్ట్రం అంతా వర్తించే విషయం పరిశీలించాలని సూచించారు.

శ్రీ వి. కృష్ణ: మార్కెటింగ్ యార్డులు విఫలమయిన కారణాలు చూస్తే, తిరిగి వాటిని జిల్లా అంతటా వర్తింప చేసేదానికిముందు పొగాకు కనీస ధరలు, పరపతి సౌకర్యం, విదేశీ మార్కెట్ అవకాశం, ఐ. యల్. టి. డి. గుత్తాధికారం తొలగింపుల విషయం ఆలోచిస్తారా?

జవాబు: అన్నీ ఆలోచిస్తాం.

శ్రీ కొల్లా వెంకయ్య: పాయిన నివేదికను సభవారికి అందచేస్తారా?

జవాబు: అది రహస్యమైనది. అందులో విదేశీ కంపెనీలను గురించి వుంది. కాబట్టి బయటపెట్టడం మంచిది గాదు.

అంతకుముందు మంత్రిగారు గుంటూరుజిల్లాలో ఐ. యల్. టి. డి. వారు పొగాకు చాలాకొన్నారన్నారు. అమ్మకానికి వచ్చిందంతా కూడా కొన్నారన్నారు కూడా. (వి. వి.)

ఆంధ్రరాష్ట్ర చెరకు ఉత్పత్తి సలహా సంఘం

అసెంబ్లీలో ప్రశ్నలు

వాల్తేరు, మే 31

నేడు ఆంధ్ర శాసనసభలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కోడుగంటి గోవిందరావుగారి ప్రశ్నకు జవాబు చెబుతూ రాష్ట్ర చెరకు సలహా సంఘాన్ని 30-3-54 న నియమించిందన్నారు.

శ్రీ గోవిందరావు: ఆ సంఘంలో ప్రతిప్రాంతంనుంచీ ప్రతినిధులుండేలా శాసనం సవరించుతారా?

జవాబు: సాధ్యంగాదు.

శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు: అనకాపల్లిలో బెల్లం ఉత్పత్తికూడా జరుగుతోందిగదా? అలాంటపుడు అక్కడనుంచి ఒక ప్రతినిధిని నియమించుతారా?

జవాబు: అవసరం లేదనుకుంటాను.

శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డి: రాయలసీమలో ఎక్కువభూమి చెరకుపంటకు వినియోగించేందుకు ప్రభుత్వం ఏదైనా ప్రణాళిక సిద్ధం చేస్తుందా?

జవాబు: రాయలసీమలో పండిన బెల్లమే అమ్ముకోలేకుండా వున్నాం.

శ్రీ గోవిందరావుగారు: పిస్మా సూత్రం ప్రకారం గత సంవత్సరం రైతులకు, యజమానులు డబ్బు యివ్వలేదు. అది యిప్పించేందుకు ప్రభుత్వం పూనుకుంటుందా?

జవాబు: అది యజమానులు ఇచ్ఛికంగా యివ్వవలసింది. వారిని నిర్బంధించలేము.

శ్రీ గోవిందరావు: ప్రభుత్వాధికారం ప్రయోగించి యిప్పించరాదా?

జవాబు: ప్రయోగించితే మళ్ళీ మీరే 'దుర్వినియోగం' అంటారు. అయినా ప్రయత్నిస్తాం.

జూన్ 3 వ తేదీన పోస్టల్ సెలవు

విజయవాడ, మే 31

జూన్ 3 వ తేదీన ఈద్ పండుగ సందర్భాన పోస్టాఫీసుకు సెలవుదినమని స్థానిక కేంద్ర పోస్టుఆఫీసువారు తెలియచేస్తున్నారు.

విశాఖజిల్లా రైతాంగం ఇక్కట్లు

తొలగించాలని రెవిన్యూ మంత్రికి మెమోరాండం

వాల్తేరు, మే 30

విశాఖజిల్లా శాసనసభ్యులు శ్రీ కె. గోవిందరావు, జిల్లా రైతునాయకులు శ్రీ పి. వెంకటరమణ తదితరులు యీ నెల 27 వ తేదీని రెవిన్యూమంత్రి శ్రీ కడప కోటిరెడ్డిగారిని కలుసుకొని దిగువ వివరాలతోనున్న ఒక మెమోరాండమును సమర్పించారు.

ప్రభుత్వం యేమాత్రం కాలయాపన చేయకుండా అన్ని మేజరు ఈనాములను వెంటనే రద్దుచేయుమా, యీనాం భూముల అమ్మకాలనూ, భూములనుండి కౌలుదార్ల తొలగింపులను నిషేధిస్తూ కోర్టులలో నున్న దావాలను డిక్రీలను నిలుపుదల చేయాలి.

విజయనగరం ఎస్టేటు గ్రామాలలో విధిస్తూన్న అధిక పెనాల్టీలను రద్దుచేయాలనీ, పల్లపు సాగుకు అనువైన భూములపై పల్లపు రేటు శిస్తు మాత్రమే విధించాలనీ, బంజరు భూములపై విధించిన ఆక్రమణ పెనాల్టీలు రద్దుచేయాలనీ, భూములు తిరిగి సర్వే చేయబడేవరకు ఆ భూములలో నున్న చెట్లపై అధికారం ఆయా రైతులకే వుండాలనీ, జలాధారాల మరమ్మతులు కొనసాగించాలనీ రాయబారులు కోరారు.

మంత్రిగారు అన్నీ సావధానంగా విని పై కోర్కెలను గురించి విచారణ జరిపి తగుచర్యలు తీసుకోగలమని తెలియజేశారు.

పంచాయితీ బోర్డు కార్మికులకు ఇండ్ల అద్దె ఎలవెన్సు

ఆమోదించాలని మంత్రి వద్దకు రాయబారం

వాల్తేరు, మే 31

తుని పంచాయితీబోర్డు కార్మిక సంఘం తరపున సంఘ అధ్యక్షులు శ్రీ పిట్లా అప్పారావుగారు, శాసనసభ్యులు శ్రీ ప్రభాకర చౌదరిగారు స్థానిక స్వపరిపాలనా మంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారిని కలుసుకొని కార్మికులకు రు. 3-0-0 లు యింటి అద్దె ఎలవెన్సు యిస్తూ తుని పంచాయితీవారు చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం ఆమోదించవలసిందని కోరుతూ ఒక మెమొరాండం సమర్పించారు. మెమొరాండంలో ఇంకా ఈ కోర్కెలను సఫలంచేయాలని కోరారు.

4 సంవత్సరాలుగ పనిచేస్తున్న మురికి బండి డ్రయివర్లను ఖాయం చేయాలి. తునిపట్టణ జనాభా పెరిగినందున అదనపు కార్మికులను వేయాలి. తుని జనరల్ మార్కెట్ స్వీపర్లకు జీతాలు, సెలవులు, పనిముట్లు ఎక్కువచేయాలి.

మెమొరాండంతో బాటు పంచాయితీ బోర్డువారు ఇండ్ల అద్దెలగురించి చేసిన తీర్మానం నకలుకూడా మంత్రిగారికి సమర్పించబడింది. మంత్రిగారు రాయబారవర్గానికి సమాధానం చెబుతూ వెంటనే తనశాఖా ఉద్యోగులకు ఈ విషయం తెలియజేస్తామని వాగ్దానం చేశారు.

చేనేత సహకార సంఘాలకు అప్పులు

సహకార బ్యాంకు ఉదారంగా యివ్వాలని విజ్ఞప్తి

వాల్తేరు, మే 30

సెంట్రల్ సహకార బ్యాంకు నిర్వహణలో చేనేత సహకార సంఘాలకు కూడ ప్రాతినిధ్య మివ్వాలని ఆంధ్ర చేనేత సహకార సంఘ అధ్యక్షులు శ్రీ దామర్ల రమాకాంతారావుగారు నేడిక్కడ చెప్పారు.

28 వ తేదీన వాల్తేరులో సహకార సంఘాల రిజిస్ట్రారు కార్యాలయంలో చేనేత సమస్యలను గూర్చి చర్చించడానికి జరిగిన సమావేశంలో శ్రీ దామర్ల రమాకాంతారావుగారు ప్రసంగించుతూ పై సూచన చేసారు.

సెంట్రల్ సహకార బ్యాంకు చేనేత సహకార సంఘాలకు ఉదారంగా అప్పులు యివ్వడంలేదని, అనేక సహకార సంఘాలు మూలధనంలేక మూలబడ్డాయని, చేనేతగుడ్డల నెలసరి ఉత్పత్తి 20 లక్షల రూపాయలకు పడిపోయిందని రమాకాంతారావుగారు అన్నారు.

* * *

కారైకల్ మున్సిపల్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ స్వామినాథ పిళ్ళెను శుక్రవారం సాయంత్రం కరైకాల్‌లో గూండాలు కొట్టారు.

రేడియో

జూన్ 3 గురువారం

విజయవాడ : (357.1 మీటర్లలో) ఉదయము :
6.55 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 మద్రాసు వలె;
8-0 (ఆం. వా);
1-0 మద్రాసు వలె;
1-30 గీత్;
1-40 (హిం. వా);
1-50 (తె. వా.);
2-15 కావ్యధార; ప్రసంగం (హిందీ);
4-0 గీతమంజరి;
5-30 త్యాగరాజకృతులు;
6-15 ప్రాంతీయ వార్తలు;
6-25 స్థానిక ప్రకటనలు;
6-30 గ్రామసీమ;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమగీతావళి;
7-30 గానసుధ;
7-45 ఈద్ ఉల్ ఫితర్ ప్రసంగం;
8-0 వీణ;
8-30 కృతులు;
9-0 (ఆం. వా);
9-15 గీతావళి;
9-30 సమాప్తి.

మద్రాస్(బి) : (270.3 మీటర్లలో) ఉదయము:
6-55 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 ఉదయ గానం;
12-0 కార్మికులకు;
1-0 గీతమాలిక;
1-30 (ఆం. వా);
1-40 గీతమాలిక;
1-50 (తె. వా.);
2-0 దిల్రుబా;
5-30 మద్రాసు ఎ వలె;
6-15 ప్రాంతీయవార్తలు;
6-25 లలిత గీతము;
6-30 గ్రామసీమ పాటు;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమగీతావళి;
7-45 సంధ్యాగానం;
9-15 గోష్ఠి గానము;
10-0 శ్రోతలు కోరిన పాటలు;
10-30 సమాప్తి.

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయము:
6-55 సుప్రభాత్;
7-0 (తె. వా.);
7 45 భజన్;
8-0 (ఆం. వా.);
8.15 (హిం. వా);
8-45 గీత్, గజల్;
12-30 గావో కుషీకే గీత్;
12-50 (మ. వా);
1-0 స్త్రీ సంసార్,
1-45 వేణునాదం;
1-50 (తె. వా);
6-0 సాహిత్య కార్యక్రమము:
6-30 శాస్త్రీయసంగీతం;
6-40 స్థానిక ప్రకటనలు;
6-45 గ్రామసీమ;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమ;
7-45 (క. వా.);
8-30 ప్రసారగీత్;
9-0 (ఆం. వా.);
9-15 (ఉ. వా.);
9-30 ప్రధానం నాటిక;
10-30 సమాప్తి.

రాయలచెర్వు ఫిర్కాలో కరువు

జిల్లాకలెక్టరువద్దకు రైతుల రాయబారం

తిరుపతి, మే 30

చిత్తూరుజిల్లా పుత్తూరు తాలూకా రాయలచెర్వు ఫిర్కాలో తీవ్రకరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నంగిరెడ్డిపల్లె, నెన్నూరు, రావిళ్ళవారిపల్లె మున్నగు గ్రామాలకు చెందిన రైతాంగం గత ఆదివారం జిల్లా కలెక్టరుకు తెలియజేశారు. రాయబారానికి శ్రీపి. నాగులు ప్రభృతులు నాయకత్వం వహించారు.

ప్రతి రెవిన్యూ గ్రామానికి ఒక గంజి కేంద్రం పెట్టించాలని, కరువు పనులు కల్పించాలని ఎద్దులు, ఎరువులు, విత్తనాల కొనుగోలుకు అప్పులు ఇప్పించాలని, మైనరు ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని కలెక్టరుకు సమర్పించిన వినతి పత్రాలలో పేర్కొనబడింది.

కలెక్టరు సమాధానమిస్తూ, రాయలచెర్వు వరవకాల్వల ప్లాను తీయించామని, ప్రభుత్వ అనుమతికై వ్రాశామని తెలియజేశారు. నక్కలవంక ఆనకట్ట పరిశీలనార్థం ఒక్కవారం రోజులలోపల ఓవర్‌సీయర్‌ను పంపుతామన్నారు. వినతిపత్రంలో పేర్కొన్న ఊటకాలువలు కొన్ని బాగుచేయిస్తామని చెప్పారు. ఒక్క నెలరోజులలోపల వర్షాలు కురియకపోతే గంజికేంద్రాలు ప్రారంభించే విషయం ఆలోచిస్తామన్నారు. రైతులకు అప్పులు యివ్వడానికై ఈ ఫిర్కాలో ఒక తహశీల్దారును, ముగ్గురు యిన్స్‌పెక్టర్లను నియమిస్తున్నామని తెలియజేశారు.

తుంగభద్ర ఇండస్ట్రీస్ కార్మిక సంఘ ఎన్నికలు

కర్నూలులో

కర్నూలు, మే 24

కర్నూలు నగరంలోని తుంగభద్రా యిండస్ట్రీస్ లేబర్ యూనియన్ ఎన్నికలు ఇటీవల జరిగాయి. అధ్యక్షులుగా అడ్వొకేటు శ్రీ బి. ఆర్. బుద్ధకవి, ఉపాధ్యక్షులుగా శ్రీ సల్లావుద్దీన్ ఎం.ఎ. గారిని ఎన్నుకొన్నారు. కార్మికేతరులను అధ్యక్ష వుపాధ్యక్షులుగా ఎన్నుకొనుటకు వీలుగా యూనియన్ నిబంధనలను మార్చుతూ తీర్మానం చేశారు.

సుమారు 220 మంది కార్మికులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు.

కార్మికుల కోర్కెలు తదితర సమస్యలపై శ్రీదాను, దేవరాజు, గులాబ్ దేవరాజ్, ఆదినారాయణ, సన్నా, బి. ఆర్. బుద్ధకవి, సల్లావుద్దీన్‌గారలు మాట్లాడారు. తర్వాత ఈ క్రిందితీర్మానాలు చేయబడ్డాయి.

"బిర్లా ఆధిపత్యం క్రిందగల సిరిపురం పేపరుమిల్లు కార్మికులకు జరుగుతున్న అన్యాయాల్ని ప్రభుత్వం విచారించి, వారికి న్యాయం కలిగించుటకు సత్వరచర్యలు తీసుకోవాలి.

"నెల్లూరు బీడీకార్మికుల సమ్మెను న్యాయసమ్మతంగా పరిష్కరించుటకు ప్రభుత్వం పూనుకోవాలి." (వి. వి.)

సభలుసమావేశాలు

కృష్ణాజిల్లా వ్యవసాయకూలీ సంఘ కార్యవర్గ సమావేశం జూన్ 5, 6 తేదీలలో విజయవాడలోని సంఘ కార్యాలయంలో జరుగుతుంది.

తిరుపతి విశ్వవిద్యాలయం

(2 వ పేజీ తరువాయి)

నారిరెడ్డి, ఖండవల్లి కృష్ణారావు, వావిలాల గోపాలకృష్ణయ్యగార్లు సవరణను బలపరుస్తూ ప్రసంగించారు.

అందరి గౌరవాదరణలకూ పాత్రమైనవాడూ, విద్యాధికుడూ, రాజకీయాల ప్రసక్తిలేనివాడూ విశ్వవిద్యాలయ ఛాన్సలరుగా ఉండడం ఉచితం అని శ్రీ నాగిరెడ్డిగారన్నారు. గవర్నర్లు మంత్రుల ప్రభావానికి లొంగిపోయే అవకాశం వుందికనుక ప్రస్తుత సంప్రదాయాన్ని మార్చవలసిన అవసరం ఉందన్నారు.

ఆయా రాష్ట్రాలలో వున్న విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర గవర్నరులే ఛాన్సలర్లుగా వుండడం సాంప్రదాయకమనీ, ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తిని ఆ పదవికి వినియోగించాలంటే అందుకు రాష్ట్రపతి అనుమతి పొందవలసి వుంటుందని మంత్రి పట్టాభిరామారావుగారన్నారు.

ప్రధాన న్యాయమూర్తిని ఛాన్సలరుగా నియమించితే చాలునని "రిటైరైన ప్రధాన న్యాయమూర్తియైనాసరే" నన్న భాగాలను తన సవరణనుండి తొలగించడానికి ఎట్టి అభ్యంతరమూ లేదని శ్రీ నడింపల్లి నరసింహారావుగారు ప్రకటించారు.

న్యాయశాఖా మంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిని ఛాన్సలరు లాంటి ఇతర పదవులకు నియోగించాలంటే అందుకు రాష్ట్రపతి అనుమతించవలసి వుంటుందని, అందువల్ల ఈ బిల్లు నిరుపయోగం అవుతుందని అన్నారు.

తర్వాత సవరణపై అధ్యక్షులు వోటు తీసుకొన్నారు. ప్రతిపక్ష సభ్యుల విజయ ధ్వానాలమధ్య సవరణ నెగ్గినట్లు ప్రకటించారు. సవరణకు అనుకూలంగా 55, ప్రతికూలంగా 53 వోట్లు వచ్చాయి. ఇంతకు పూర్వం వోటింగులో ప్రభుత్వంతో కలిసిన ప్రజాసోషలిస్టులు ఇప్పుడు ప్రతిపక్షంతో కలిసి వోటు చేశారు.

తర్వాత సభవారు పెద్దచర్చ లేకుండానే 12-13-14 క్లాజులను ఆమోదించారు. 15 వ క్లాజుకు శ్రీ సి. వి. కె. రావుగారు ఒక సవరణ ప్రతిపాదించారు. ఇది సెనేట్ సభ్యులను నిర్వచించే క్లాజు. వైద్యశాఖ - వ్యవసాయశాఖ డైరెక్టర్లకూ, కాలేజీల ప్రిన్సిపాల్సుకు సెనేటులో సభ్యత్వం ఉండరాదని సి. వి. కె. రావుగారి సవరణలోవుంది. ఈ సవరణ మూజువాణీ వోటుతో వీగిపోయింది. 25 వేల రూపాయలు విరాళం యిచ్చిన వారికి సెనేటులో శాశ్వత సభ్యత్వం వుండాలన్న సూత్రాన్ని తొలగించాలని శ్రీ మోటూరు హనుమంతరావుగారు ప్రవేశపెట్టిన సవరణకూడా వీగిపోయింది. శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డి, శివరామిరెడ్డిగార్లు కూడా ఈ విషయంపైనే రెండు సవరణలు పెట్టారు. కాని అవికూడా వీగిపోయాయి.

ఆ దశలో సభ మర్నాటికివాయిదా పడింది.

* * *

ఇంతకుముందువలె బిరుదులు ఇవ్వడానికి వీలయ్యేట్లు భారత రాజ్యాంగాన్ని సవరించాలని మైసూర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చునని ముఖ్యమంత్రి హనుమంతయ్య తెలియజేశారు.

ఇండోచైనా యుద్ధ పరిశీలక సంఘంలో ఇండియా

సోవియట్ సూచన

జెనీవా, మే 31

నేడు జరిగిన తొమ్మిది రాజ్యాల ఇండోచైనా సమావేశంలో సోవియటు ప్రతినిధి గ్రోమికో ఇండియా, పాకిస్తాన్, పోలెండు, జెకోస్లోవాకియాలతో కూడిన తటస్థరాజ్య సంఘం పర్యవేక్షణలో ఇండో - చైనా యుద్ధవిరమణ కార్యక్రమం సాగాలని ప్రతిపాదించాడు.

నేటి సమావేశానికి బ్రిటిష్ విదేశాంగమంత్రి ఆంథోనీ ఈడెన్ అధ్యక్షత వహించాడు. సోవియటు విదేశాంగ మంత్రి మోలటోవ్ మాస్కోలో వుండడంచేత ఆయనస్థానే గ్రోముకో చర్చలలో పాల్గొన్నాడు.

యుద్ధవిరమణ, ఉభయపక్ష సైన్యాలను గుమికూర్చడం విషయమై నిర్ణయం జరిగి రెండుపక్షాలసైన్య ప్రతినిధులను చర్చలకు వొప్పచెప్పడం జరిగిపోయింది కనుక నేడు పర్యవేక్షణ సమస్యను చర్చకు తీసుకొన్నారు.

చైనా ప్రధాని చౌ - ఎన్ - లై ప్రస్తుతం కొరియాలో వున్న మాదిరిగానే తటస్థదేశాల సంఘం పర్యవేక్షణ జరపడం బాగుంటుందని సూచించాడు. కొరియాలో స్విట్జర్లండు, స్వీడన్, పోలెండు, జెకోస్లోవాకియాలతో కూడిన తటస్థ రాజ్యాల సంఘం యుద్ధవిరమణ నిబంధనల పర్యవేక్షణకు నియమించబడింది.

దీనిని వియత్మిన్ ప్రతినిధి సమర్థిస్తూ మాట్లాడాడు.

అమెరికా ప్రతినిధివర్గ నాయకుడు బెడెల్ స్మిత్ ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో యుద్ధవిరమణ జరగాలని చెప్పాడు.

తర్వాత గ్రోముకో మాట్లాడుతూ ఇండియా, పాకిస్తాన్, పోలెండ్, జెకోస్లోవాకియాలతో తటస్థ సంఘం ఏర్పడడం అవసరమని సూచించాడు.

నేటి సమావేశానికి ముందు, అందులో పాల్గొంటున్న కమ్యూనిస్టేతర రాజ్యాలు అనా చర్చలు జరిపాయి. తర్వాత మరల ఈడెన్, బెడెల్ స్మిత్, బిదాలు తమలో తాము సంప్రదించుకొన్నారు.

గ్రోముకో ప్రతిపాదన సమావేశంలో రావడంచేత పాశ్చాత్యరాజ్యాలు సమాధానం ఇవ్వడానికి వీలుపడలేదని చెప్పారు.

సోవియటు సూచనకు పాశ్చాత్య రాజ్యాల వ్యతిరేకత

జెనీవా, జూన్ 1

రేపు జరగబోయే ఇండోచైనా సమావేశంలో పాశ్చాత్య రాజ్యాలు తటస్థ సంఘానికి సోవియటు ప్రతినిధి ఇచ్చిన పేర్లను నిరాకరించడానికి నిర్ణయించుకొన్నట్లు తెలుస్తూంది.

నిన్న వుదయమే ఆరు రాజ్యాల ప్రత్యేక సమావేశంలో పర్యవేక్షక సంఘంలో వుండదగిన సభ్యుల పట్టికను తయారుచేశారనీ, కాని, అందరికీ ఏకాభిప్రాయం కుదరక పోవడంచేత తొమ్మిదిరాజ్యాల సభలో ఆ పట్టికను ప్రతిపాదించలేదనీ చెప్పబడుతూంది.

ఇప్పుడు పాశ్చాత్య రాజ్యాలు వేరొక పట్టికను తయారు చేస్తున్నాయనీ, దానిలో ఇండియా, కొలంబో సభలో పాల్గొన్న ఆసియా రాజ్యాలలో మరొకటి రెండూ వుండవచ్చుననీ చెప్పుతున్నారు.

కొలంబో సభలో పాల్గొన్న ఆగ్నేయాసియా రాజ్యాలు అయిదు. ఇండియా, పాకిస్తాన్, సింహళం, బర్మా, ఇండోనేషియా.

ఫ్రెంచి పార్లమెంటులో బిదా విధానంపై చర్చ

పలువురుసభ్యుల ఖండన తీర్మానాలు

పారిస్, జూన్ 1

ఫ్రెంచి మంత్రివర్గం ఎంత ఆటంకపరిచినా ఫ్రెంచి పార్లమెంటులో ఇండోచైనా సమస్యపై తీవ్ర చర్చలు నేడు ప్రారంభమైనాయి.

జెనీవా సంప్రదింపులలో ఫ్రెంచి విదేశాంగమంత్రి జార్జి బిదా "బ్రిటిషు స్నేహితులకు తెలియకుండా" ఇతరులతో చర్చలు జరిపాడనీ, "శాంతి సంప్రదింపులను భగ్నపరచడానికై ప్రయత్నించా"డనీ వివరిస్తూ సభ్యులు చాలతీర్మానాలను సభలో తెచ్చారు.

దీనిని ప్రభుత్వంపై విశ్వాససమస్యగ ప్రధాని లానియల్ ప్రతిపాదిస్తాడని భావించబడుతూంది.

కృష్ణమీనన్ జెనీవా తిరుగు ప్రయాణం

లండన్, మే 31

ఐ. రా. స. లో భారత ప్రతినిధి శ్రీ వి. కె. కృష్ణమీనన్ బుధవారం జెనీవాకు తిరిగి వెడతారు. అక్కడ సమావేశం అవుతున్న వివిధ రాజ్యాల ప్రతినిధివర్గ నాయకులతో తమ సంభాషణలను యథాపూర్వంగా కొనసాగిస్తారు.

ఆయన లండన్‌లో నేడు మధ్యాహ్నం బ్రిటిష్ విదేశ వ్యవహారాలశాఖ ఉపమంత్రి సెల్విన్‌లాయడ్‌ను కలుసుకొన్నారు. అంతకు పూర్వం లేబర్‌పార్టీ నాయకుడు అట్లీని కలుసుకొన్నారు.

◆

ఇనుము ఉక్కు కంట్రోలు ఉత్తర్వులు ఉల్లంఘించినట్లు మద్రాసు శాసనసభ్యులు డాక్టర్ వరదరాజులు నాయుడుగారిపై పెట్టబడిన కేసును ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటు కొట్టివేశారు.

బజారు ధరలు

విజయవాడ, జూన్ 1

(మధ్యాహ్నం గ.3-0)

బంగారం ధరలు

		రు.	అ.	పై
మేలిమి : పొట్లా		88	0	0
మూసా		87	0	0
నవరసు		60	10	0
వెండి : 100 తులములు		162	8	0
1 తులము		1	11	0
ధాన్యం ధరలు				
24 నెంబరు		22	0	0
బంకసన్నాలు		21	0	0
12 నెంబరు		20	4	0
అక్కుళ్ళు		19	8	0
కుసుమ		19	8	0
కొణామణి		19	8	0
బియ్యం ధరలు				
24 నెంబరు		55	0	0
బంకసన్నాలు		48	0	0
12 నెంబరు		45	8	0
అక్కుళ్ళు		45	0	0
కుసుమ		44	8	0
కొణామణి		44	8	0
అపరాల ధరలు				
మినుములు 240 శే		44	0	0
కందులు		23	0	0
నల్లపెసలు (మాగాని)	34/-	35	0	0
పచ్చపెసలు 280శే॥	30/-	31	0	0
పచ్చపెసలు (మెట్టవి)	33/-	36	0	0
శెనగలు (దేశవాళీ)		36	0	0
,, పంజాబు		32	0	0
ధనియాలు 90 శేరులు		27	0	0
ఉలవలు	27/-	30	0	0
ఆముదాలు		31	8	0
పంచదార (ఉయ్యూరు)		91	8	0
బెల్లం మణుగు		6	4	0
మిర్చి దేశవాళీ మణుగు	24/-	25	0	0
మిర్చి పైజాము	18/-	20	0	0
వేరుశనగ ధరలు				
వేరుశనగపప్పు 177 శేరులు		55	0	0
,, నూనె మణుగు		14	0	0
,, కేక్ 160 శేరులు		16	12	0
,, పుడ్డిపిండి 160 ,,		19	4	0
కొబ్బరికా॥ 1,000 అమలా		146	0	0
పాలకొల్లువి ,,		138	0	0
కొబ్బరినూనె డబ్బా		29	4	0
పసుపు పుట్టి		270	0	0
సంచులు 100		103	8	0
నీరుల్లిపాయలు మ॥		1	6	0
వెల్లుల్లి మణుగు	5-0-0	5	8	0

భారత పోలీసులకు ఫ్రెంచివారికి ఘర్షణ

ఇద్దరి మరణం

పుదుచ్చేరి, మే 31

ఇక్కడికి 10 మైళ్ళ దక్షిణంగా పన్నిత్తిట్టు అనే చోట భారతీయ పోలీసులకు, ఫ్రెంచివారికి నేటిఉదయం సంఘర్షణ జరగగా, ఇద్దరు మరణించినట్లు, కొంతమంది గాయపడినట్లు తెలుస్తున్నది.

దొంగవ్యాపారం చేస్తున్న కొంతమందిని భారతీయ కస్టమ్స్ అధికారులు పట్టుకోగా, వారిని విడిపించడానికి 300 మంది ఫ్రెంచి పోలీసులు భారత భూభాగంలోకి వచ్చారనీ, ఈ సందర్భంలో సంఘర్షణ జరగగా భారత ప్రత్యేక సాయుధ పోలీసులు కాల్పులు జరపవలసి వచ్చిందని తెలుస్తున్నది.

మన బోధనలను ఆచరణలో చూపాలి

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవరు ధర్మపన్నాలు

న్యూయార్కు, మే 31

ఇతరులకు బోధించే స్వాతంత్ర్య ధర్మాన్ని మన దేశంలో మనం అమలు జరపాలని నేడు అమెరికా అధ్యక్షుడు ఒక విందులో ఉపన్యసించాడు.

కొలంబియా యూనివర్సిటీ ద్విశతాబ్ది ఉత్సవపు విందులో ఐసెన్‌హోవరు ఉపన్యసిస్తూ ఆటంశక్తి నిధి విషయమై సోవియట్ యూనియన్ సహకారంకోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయనీ, అయినా తాము ఇతర దేశాలతో సంప్రతింపులు సాగిస్తున్నామనీ అన్నాడు. కొరియాలో యుద్ధవిరమణ సందర్భంలో నైతేనేం, స్వతంత్ర ఐక్యజర్మనీ నిర్మాణానికైతేనేం, ఆస్ట్రియా విముక్తికైతేనేం, ఇండోచైనా, ఆగ్నేయాసియాల క్షేమానికైతేనేం, అణుశక్తిని అంతర్జాతీయ పర్యవేక్షణలో శాంతియుతావసరాల వినియోగానికైతేనేం అమెరికా చేస్తున్న సూచనలన్నీ దేశాలమధ్య విశ్వాసం కలిగించడానికే తోడ్పడుతున్నట్లు ఆయన చెప్పాడు.

సైనిక సిబ్బందికై ఇండ్ల ఖాళీ

పోర్చుగీస్ అధికారుల దౌర్జన్యం

బొంబాయి, మే 31

వాస్కోడిగామాలో 40 ఇండ్లలో నివసిస్తున్నవారిని ఖాళీ చేయమని పోర్చుగీస్ మిలిటరీ అధికారులు ఉత్తర్వు చేసినట్లు ఇక్కడకు వర్తమానం చేరింది.

ఈ ఇండ్లను సైనిక సిబ్బందిని ఉంచడానికి, యుద్ధ పరికరాలను నిల్వచేయడానికి ఉపయోగించుతారట. ఇళ్ళు ఖాళీ చేయడానికి వారం రోజులు గడువు యిచ్చారట.

ఇండియాకు వచ్చిన చైనా యుద్ధ ఖైదీ

చైనాకు అప్పగించడానికి భారత ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, మే 31

కొరియాలో భారత కాపలాదళంతోపాటు ఇండియాకు తిరిగి వచ్చిన 88 మంది యుద్ధ ఖైదీలలో ఒకడైన లీ-చావ్-జూను ఈ వేళ ఉదయం ఇండియా ప్రభుత్వం ఢిల్లీలో చైనా రాయబార కార్యాలయానికి అప్పగించింది.

లీ-చావ్-జూ తన మాతృదేశమైన చైనాకు వెళ్ళాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అందువలన భారత ప్రభుత్వం ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయానికి అతనిని అప్పజెప్పడానికి నిశ్చయించింది. అతనిని అప్పజెప్పుకోడానికి చైనా రాయబార కార్యాలయంవారు ఆమోదించారు.

బొంబాయి రేవు కార్మికుల సమ్మె

బొంబాయి, మే 31

మందకొడిగా పనిచేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన బొంబాయి రేవు కార్మికులు తిరిగి మామూలుగా పనిచేయడానికి పూనుకున్నారట. అయితే రంగులు వేసే కార్మికులు 1500 మంది మాత్రం ఇంకా సమ్మె సాగిస్తున్నారు.

ఇక్కడనే వున్న భారతప్రభుత్వ ప్రధాన లేబర్ కమీషనర్ శ్రీ యస్. సి. జోషి బొంబాయి పోర్టుట్రస్టు అధ్యక్షునితో, రేవు కార్మిక సంఘాలతో మధ్యవర్తి సమాలోచనలు సాగిస్తున్నారు.

రాజకీయ భౌగోళిక ఐక్యతకు ప్రాతిపదిక

ఇండోచైనాలో ప్రాంతాల నిర్మాణంపై వియత్మిన్ ప్రతినిధి వివరణ

జెనీవా, మే 31

"యుద్ధవిరమణ అనంతరం ఉభయపక్ష సైన్యాలను గుమికూర్చేటందుకు ఇండోచైనాలో ప్రాంతాల నిర్మాణం తాత్కాలికమేననీ, అది రాజకీయ, భౌగోళికైక్యతకు ప్రాతిపదికకాగలదనీ వియత్మిన్ ప్రతినిధి నేడొక పత్రికా విలేఖరుల సభలో వివరించాడు.

ఇండోచైనా ప్రజల ప్రాథమిక హక్కుల నంగీకరించడం, ఫ్రెంచి ప్రజలతో వారికి మైత్రిని ఏర్పరచడం అనేదే ఇండోచైనాలో యుద్ధ విరమణకు గమ్యం అని నేడిక్కడ వియత్మిన్ ప్రతినిధివర్గ సభ్యుడు హువాంగ్ వాన్ హువాన్ పత్రికా విలేఖరులతో అన్నాడు.

హువాన్ చైనాలో వియత్మిన్ రాయబారి. ఆయన యింకా యిలా అన్నాడు:

"కొద్ది కొద్ది సర్దుబాట్లతో ప్రాంతాలను నిర్ణయించ వలసి వచ్చినా అది తాత్కాలికమేననీ, స్వేచ్ఛాయుతమైన ఎన్నికల ద్వారా దేశాన్ని రాజకీయంగానూ, భౌగోళికంగానూ ఐక్యపరచడానికది ప్రాతిపదిక కాగలదనీ మా అభిప్రాయం.

"యుద్ధ విరమణ అతి ప్రధానం. దానితోపాటు రాజకీయ సమస్యలు కూడా పరిష్కారం కావాలి. ఈ విషయంలో సైన్య రాజకీయ సమస్యలను విభజించడం సాధ్యంకాదు.

"సైన్యములను గుమికూర్చడానికై ప్రాంతాలను సర్దుబాటుచేసి నిర్ణయించేటందుకు అంగీకరించనివారు యుద్ధ విరామానికి కూడా యిష్టపడడంలేదని చెప్పాలి.

"ప్రాంతాలను సర్దుబాటుచేసి నిర్ణయించడం ఒక్కటే యుద్ధ విరామానికి తోడ్పడగలదని, యుద్ధ విరామంలేనిదే శాంతి లేదనీ, మేము దానిని ప్రతిపాదించాము."

యుద్ధ విరమణకు పూర్వమే రాజకీయ సమస్యల పరిష్కారం అవసరమని భావిస్తున్నారాయని ఒక విలేఖరి ప్రశ్నించగా ఆయన యిల్లా అన్నాడు.

"ఇక్కడ సైనిక, రాజకీయ సమస్యలను విడదీయడానికి వీలులేదు."

ఇండోచైనాలో శాంతి అనేది అందులోని మూడు రాష్ట్రాలలోనూ కూడ వర్తింపచేయాలా అక్కర్లేదో జెనీవా సమావేశం నిర్ణయించగలదని ఆయన వేరొక ప్రశ్నకు సమాధానం యిచ్చాడు.

వియత్‌మిన్ సైన్య ప్రతినిధి త్వరలోనే జెనీవా వస్తున్నాడని ఆయన చెప్పాడు.

బీడీ కార్మికుల అరెస్టు: విడుదల

నెల్లూరు సమ్మె కొనసాగింపు

నెల్లూరు, మే 31

నెల్లూరు బీడీ కార్మికసమ్మె యథాప్రకారంగా కొనసాగుతోంది. నేడు బీడీ కంపెనీలవద్ద పికెటింగు చేస్తున్న 40 మంది కార్మికులలో 17 మందిని పోలీసులు అరెస్టుచేసి మరల విడుదల చేశారు. పికెటింగ్ శాంతియుతంగా జరుగుతోంది. కంపెనీల లోపల పని చేస్తున్న వారందరు వెలుపలికి వచ్చేశారు. పికెటింగు చేస్తున్న కార్మికులకు భోజనాది సౌకర్యాలు కల్గించుటద్వారా ప్రజలు తమ సానుభూతి తెలుపుతున్నారు.

ట్రిబ్యునల్ విచారణకు యజమానుల నిరాకరణ

నెల్లూరు, మే 31

నెల్లూరు బీడీ కార్మిక వివాదాన్ని ట్రిబ్యునల్‌కు పంపుటకు కార్మికులు తమ అంగీకారం తెల్పారు. కాని యజమానులు అంగీకరించలేదు.

లేబరు ఆఫీసరు శ్రీ కె. సత్యనారాయణమూర్తిగారు గుంటూరు నుండి నిన్న ఇక్కడకు వచ్చి ఉభయ పక్షాలను కలుసుకొని రాజీప్రయత్నాలు చేశారు. లోగడ [illegible] నియమింపబడిన మధ్యవర్తి కమిటీతో యజమానులు సహకరించలేదు. [illegible] కమిటీ ముందుంచమని కోరితే అందుకు నిరాకరించారు. ఇప్పుడు ప్రభుత్వలేబర్ ఉద్యోగులు వచ్చి రాజీచేయుటకు ప్రయత్నించినప్పటికి యజమానులు అందుకు నిరాకరిస్తున్నారు. ట్రిబ్యునల్ విచారణకు [illegible]. పోలీసుల సహాయంతో యజమానులు తమ వ్యాపారం కొనసాగించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

బహిరంగ సభ

నిన్న కో-ఆపరేటివ్ బ్యాంకు వెనుక 2 వేలమందితో సభ జరిగింది. శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు సమ్మె పరిష్కారానికి పూనుకొని కాంగ్రెసు ప్రభుత్వ విధానాలను విమర్శించారు. శ్రీ సి. వి. నరసింహం, జి. వెంకటేశ్వర్లు, డాక్టర్ రామచంద్రారెడ్డి, వి. అనంతరామయ్య, బాబుబీడీకంపెని యజమాని కార్మికుల సమ్మెను బలపరుస్తూ మాట్లాడారు.

మహిళా సంఘ సానుభూతి

నెల్లూరు జిల్లా మహిళా సంఘ కార్యవర్గ సమావేశం 29 వ తేదీన శ్రీమతి ఎ. శ్యామలాంబగారి అధ్యక్షతను జరిగింది. బీడీకార్మికుల సమ్మెను బలపరుస్తూ, ఈ వివాదాన్ని ట్రిబ్యునల్‌కు పంపాలని కోరుతూ ఒక తీర్మానం చేశారు. అరెస్టయినవారి నందరిని విడుదల చేయాలని కోరారు.

బీడీ కార్మిక నాయకుల నిరాహార దీక్షా విరమణ

వివాదాన్ని ట్రిబ్యునల్‌కు పంపుటకు సబ్‌కలెక్టర్ సిఫారసు ఫలితంగా

రాపూరు, జూన్ 1

నెల్లూరుబీడీ కార్మిక నాయకులు శ్రీ మాధవరావు, ఇస్మాయిల్‌గార్లు కార్మికుల కోర్కెలంగీకరించాలని కోరుతూ ప్రారంభించిన నిరాహారదీక్షను నేడు సబ్‌కలెక్టరు జోక్యం చేసుకోవడంతో విరమించారు. వివాదాన్ని ట్రిబ్యునల్‌కు పంపాలని సబ్‌కలెక్టరు సిఫారసు చేసినమీదట పై విధంగా నిరాహార దీక్ష విరమించ బడింది. శ్రీ ఇస్మాయిల్, మాధవరావుగార్లు నిరాహార దీక్ష ప్రారంభించగానే రాపూరునుండి కావలి సబ్‌జైలుకు మార్చబడినారు.

హేమలతా నూలు మిల్లు కార్మిక సమ్మె విరమణ

వెన్వెంటనే కార్మికులపై మేనేజిమెంటు దాడి

పెదకాకాని, మే 31

హేమలతా మిల్లు కార్మికులు సమ్మె ప్రారంభించి 17 రోజులైన పిమ్మట 29వ తేదీని కార్మికులు సమ్మె విరమించారు. పార్లమెంటు సభ్యులు శ్రీ ఎస్. వి. ఎల్. నరసింహంగారు కార్మికుల తరఫున మేనేజిమెంటుతో సంప్రతింపులు జరిపిన ఫలితంగా సమ్మె విరమణ జరిగింది. 29 వ తేదీన చాలమంది కార్మికులు పనిలోకి వెళ్ళారు. రాజీ కుదిరిన విషయం తెలియక దాదాపు 125 మంది కార్మికులు పనిలోకి పోలేదు. నేడు వారు పనిలోకి వెళ్ళగా రాజీ ప్రకారం మీరు 29 వ తేదీనే పనిలోనికి రాలేదనిచెప్పి మేనేజరు వారిని పనిలోకి తీసుకొనుటకు నిరాకరించాడు. పనిలోకి రానందుకు సంజాయిషీ ఇవ్వమన్నాడు.

సమ్మె విరమించిన వెంటనే కార్మికులపై మేనేజిమెంటు అక్రమదాడి ప్రారంభించి 125 మందిని పనిలోకి తీసుకోనందున కార్మికులందరు తీవ్ర అసంతృప్తి వెల్లడిస్తున్నారు. వెంటనే వారిని పనిలోనికి తీసుకోవాలనీ, లేనియెడల కలిగే పరిణామాలకు మేనేజిమెంటుదే బాధ్యతయనీ కార్మికసంఘం వారు మేనేజిమెంటుకు హెచ్చరిక చేశారు.

తిరుపతి బిల్లు

(1 వ పేజీ తరువాయి)

వైస్‌ఛాన్సలరు అధికారాలకు సంబంధించిన 19 వ క్లాజుకు శ్రీ సి. వి. కె. రావుగారొక సవరణ ప్రతిపాదించారు. సిండికేటు తన అధికారాలను వైస్ ఛాన్సలరుకు ఇవ్వరాదని ఆ సవరణలో కోరారు. కాని ఆ సవరణ నెగ్గలేదు.

తర్వాత సభవారు 20 వ క్లాజునుంచి 31 వ క్లాజు వరకు చిన్న చిన్న మార్పులనేవో కొన్ని చేసి ఆమోదించారు. 32-36 క్లాజులకు ప్రతిపక్ష నాయకుడు శ్రీ నాగిరెడ్డిగారు పెట్టిన చిన్న చిన్న సవరణలను ప్రభుత్వంవారంగీకరించారు. అటు తర్వాత 37 వ క్లాజునుంచి, 46 వ క్లాజు వరకూ పెద్ద మార్పులేమీ చేయకుండానే సభవారామోదించారు.

అనుబంధ కళాశాలలకు సంబంధించిన 47 వ క్లాజుకు మంత్రి పట్టాభిరామారావుగారే ఒక సవరణ ప్రతిపాదించారు.

1954 విద్యా సంవత్సరం మొదలుకొని 1955 విద్యాసంవత్సరాంతం వరకు శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయ గోదావరులు, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరుజిల్లాలలో వున్న కళాశాలలన్నీ ఆంధ్ర విశ్వవిద్యాలయానికే అనుబంధంగా వుండాలని, రాయలసీమ కళాశాలలు మద్రాసు విశ్వవిద్యాలయ ఆధ్వర్యాన ఉండరాదని ఆ సవరణ సారాంశం.

ఈ సవరణను సభ వారామోదించారు. అటుపిమ్మట 48వ సవరణనుకూడ ఆమోదించిన తర్వాత సభ మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా పడింది.

విజయవాడ 17 వ వార్డు ఉప ఎన్నిక నామినేషన్లు

కమ్యూనిస్టు అభ్యర్థిగా శ్రీ బూరాడ శీతారామయ్యగారి పోటీ

విజయవాడ, జూన్ 1

విజయవాడ మున్సిపాలిటీ 17 వ వార్డు ఉపఎన్నికకు పోటీచేస్తున్న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన నేటి ఉదయం పూర్తి అయింది.

శ్రీ బూరాడ శీతారామయ్యగారు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. శ్రీ బెక్కెం కోటయ్య, శ్రీ వంగర సుందరరావు, శ్రీ పూనూరి శామ్యూల్‌గార్ల నామినేషన్లను, బూరాడ శీతారామయ్యగారి నామినేషనును నేటి ఉదయం ఎన్నికల ఉద్యోగి అంగీకరించారు.

17 వ వార్డు ఉపఎన్నిక జూన్ 22 వ తేదీన జరుగుతుంది. జూన్ 23 న ఓట్లు లెక్కించబడతాయి.

కలకత్తాకు ఆంధ్ర మహిళా ప్రతినిధుల పయనం

అ. భా. మహిళా మహాసభకు హాజరయ్యేందుకు

విజయవాడ, జూన్ 1

ఈనెల 4, 5, 6 తేదీలలో కలకత్తాలో జరుగనున్న అఖిల భారత మహిళా మహాసభకు హాజరయేందుకు ఆంధ్రదేశంనుంచి యీ ప్రతినిధులు నిన్న సాయంత్రం జనతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్ళారు:

శ్రీమతులు మానికొండ సూర్యావతి, అనుమర్లపూడి లలితాంబ, వీరమాచనేని ప్రభావతి, మాగంటి ఇందిరాదేవి, జొన్నలగడ్డ సుబ్బమ్మ, గారలు.

ఆంధ్రరాష్ట్ర మహిళా సంఘాధ్యక్షురాలు డాక్టరు లక్ష్మి, వాగళ్ళ రాజేశ్వరి మొదలైనవారు ఈవేళ, రేపు బయలుదేరనున్నారు.

"ప్రజాస్వామ్యానికే విరుద్ధమైన చర్య"

పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వ చర్యను గర్హిస్తూ మౌలానా భషానీ ప్రకటన

అమెరికా - పాకిస్తాన్ సైనిక ఒడంబడిక వుద్దేశం ప్రజాఉద్యమాలను అణచటమేనని స్పష్టీకరణ

లండన్, మే 31

పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం, తూర్పు బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయటాన్ని గురించి మాట్లాడుతూ "ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలోనే అపూర్వమైన విషయమని చెప్పవచ్చు" అని తూర్పు పాకిస్తాన్ అవామీలీగ్ అధ్యక్షుడూ, ఐక్యసంఘటన ప్రముఖ నాయకులలో ఒకరూ ఐన మౌలానా అబ్దుల్ హామీద్ భషానీ అన్నాడు.

తూర్పు బెంగాల్లో జరిగిన కొట్లాటలూ, కల్లంతులూ కేంద్ర ప్రభుత్వ ప్రేరితాలేననీ, అంచేత యీ పరిస్థితులకు బాధ్యులు పాకిస్తాన్ ప్రధాని మహమ్మదాలీ, ముస్లింలీగ్ లేనని కూడ మౌలానా భషానీ అన్నాడు.

"అమెరికా-పాకిస్తాన్ సైనిక ఒడంబడికమీద సంతకాలు జరగగానే తూర్పు పాకిస్తాన్ మంత్రివర్గం రద్దు చేయబడింది; ఇదంతా చూస్తూంటే పాకిస్తాన్ సామ్రాజ్యవాద కాంక్ష బయట పడుతోంది. ప్రజా వుద్యమాలను అణచేందుకే ఆ ఒడంబడిక వుద్దేశింపబడింది" అని పత్రికా విలేఖరుల ముందు, భషానీ ప్రకటించాడు.

"సైనికశిక్షణ పొందిన వ్యక్తి-మేజర్ జనరల్ ఇస్కందర్ మీర్జా - ప్రజాస్వామ్య దేశం కాదలుచుకున్న తూర్పుబెంగాల్‌కు గవర్నరుగా నియమింపబడడం విచారకరమైన విషయం" అని మౌలానా భషానీ చెప్పాడు.

కమ్యూనిస్టులకూ, ఐక్యసంఘటనకూ గల సంబంధాన్ని గురించి వివరించవలసినదిగా పత్రికా విలేఖరులు కోరినమీదట "ఐక్య సంఘటనను నిర్మించిన పక్షాలలో కమ్యూనిస్టుపార్టీ లేదనీ, కాని కమ్యూనిస్టులు ఐక్య సంఘటనను బలపరచే వారిలో వొకరనీ" మౌలానా భషానీ అన్నాడు.

ఎస్టేట్లలో గ్రామాధికారుల జీతాలు

పెంచే విషయమై ప్రభుత్వం ఆలోచిస్తున్నదట

వాల్తేరు, జూన్ 1

జమీందారీల రద్దుఫలితంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న ఎస్టేట్లలో గ్రామాలను పునర్వ్యవస్థీకరణచేసే విషయాన్ని, అక్కడి గ్రామాధికారుల జీతాలను పెంచి, రైత్వారీ ప్రాంతాలలో గ్రామాధికారుల జీతాలతో సమానం చేసే విషయాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని రెవిన్యూ మంత్రి శ్రీ కడప కోటిరెడ్డిగారు శ్రీ రొక్కం లక్ష్మీనరసింహందొరగారి ప్రశ్నకు సమాధానంగా నేడు తెలియజేశారు.

ఉపప్రశ్నకు జవాబుచెబుతూ, ఈ కార్యక్రమం ఒక సంవత్సరంలో పూర్తి కావచ్చునని మంత్రి అన్నారు. అంతకు ముందు శ్రీ ఖండవల్లి కృష్ణారావుగారి ప్రశ్నకు జవాబు చెబుతూ, ఎస్టేట్లలో గ్రామాధికారులకు భూమిశిస్తు వసూళ్ళపై కమిషన్ ఇవ్వబడుతున్నదన్నారు. 1951 వరకూ నూటికి 4 వంతులు కమిషన్ ఇవ్వబడుతుండగా, నేడు అది 5 వంతులకు పెంచబడిందన్నారు.

నగరంలో సినిమాలు

2—6—54

శ్రీదుర్గాకళామందిరం

విజయావారి

పెళ్లి చేసి చూడు

రామారావు, సావిత్రి, రంగారావు

4 వ వారం 2 ఆటలు

శ్రీ విజయ టాకీస్

పరోపకారం

వరలక్ష్మి, ముక్కామల

2 ఆటలు

శ్రీ ఈశ్వర మహల్

జ్యోతి

జి. వరలక్ష్మి, సావిత్రి, శ్రీరామమూర్తి

5 వ వారం 2 ఆటలు

శ్రీ లీలామహల్

ROSE OF CIMARRON

రౌడీ కన్య

పంచరంగుల చిత్రం 3 ఆటలు

శ్రీలక్ష్మి టాకీస్

బ్రతుకు తెరువు

నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు

2 వ వారం 2 ఆటలు

శ్రీ మారుతి సినిమా

దోస్తు

ఉషాకిరణ్, సురేష్, 3 ఆటలు

త్వరలో - టాక్సీడ్రైవర్

శేష్ మహల్

దారా

షేక్ ముఖ్తార్, ముక్రి, నిగార్.

3 ఆటలు

గుంటూరు సినిమాలు

ప్రభాకర్ టాకీస్

పరోపకారం

రేలంగి, సి. యస్. ఆర్. సావిత్రి.

2 ఆటలు

శ్రీలక్ష్మీపిక్చర్ ప్యాలెస్

బ్రతుకు తెరువు

నాగేశ్వరరావు, రేలంగి, సావిత్రి

2 ఆటలు

హైద్రాబాద్ రాష్ట్ర ప్రెస్‌కార్మిక మహాసభ

జూన్ 6 వ తేదీని ప్రతాపగిర్జి కోఠీలో

అధ్యక్షులు : శ్రీ యస్. రామనాథం (ఎమ్. ఎల్. ఏ.)

ప్రారంభకులు : శ్రీ బనిశెట్టి అప్పారావు.

(ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌కార్మిక సంఘాధ్యక్షులు)

6 వ తేదీ ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 - 30 గంటలకు బహిరంగసభ జరుగుతుంది. బహిరంగసభకు రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి శ్రీ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి ఎం. ఎల్. ఎ. అధ్యక్షత వహించుతారు.

ఇట్లు,

హైద్రాబాద్ రాష్ట్ర ప్రెస్ కార్మిక సంఘం

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ : స్వతంత్ర అచ్చు ప్రింటర్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ. సంపాదకవర్గం :— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] [illegible], కాట్రగడ్డ రాజగోపాలరావు.